


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:13 WEDNESDAY ,JUNE 10,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :13 బుధవారం, జూన్ 10, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


# జోరు వానను లెక్కచేయని రేవంత్ రెడ్డి


## మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ




-హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
-పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా శక్తి సభ
-వర్షంలో తడుస్తూనే వేదికపైకి సీఎం రేవంత్, మంత్రులు
-మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ
-స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందజేత

2

## ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారైన వస్త్రాలు..



రీసైక్లింగ్ ద్వారా రూపొందించిన కండువా, చొక్కాను పరిశీలించిన ముఖ్యమంత్రి



## విదేశీ పనిమనుషులపై తెలంగాణ పోలీసుల నిఘా

-ప్రత్యేక డేటాబేస్ తయారీకి ఆదేశాలు
-రాష్ట్రంలోని విదేశీ పనిమనుషుల వివరాలు సేకరించాలని తెలంగాణ
-పోలీసుల నిర్ణయం ముఖ్యంగా నేపాల్‌కు చెందిన వారిపై ప్రత్యేకంగా దృష్టి
-ఇటీవల పెరిగిన నేరాల నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు
-హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్యతో అప్రమత్తం
-'మీ సురక్ష' కింద ఇప్పటికే 1200 మందికి పైగా నేపాలీల నమోదు

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** తెలంగాణలో నేపాల్ సహా ఇతర దేశాల నుంచి వచ్చి గృహ కార్మికులుగా పనిచేస్తున్న వారిపై రాష్ట్ర పోలీసులు నిఘా పెంచారు. ముఖ్యంగా నేపాలీ పనిమనుషుల వివరాలతో కూడిన సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో నేపాల్‌కు చెందిన కొందరు పనిమనుషులు వరుస నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, భద్రతను పటిష్ఠం చేసేందుకు పోలీస్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. మిగతా3లో

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు

-మేము 18 గంటలు కష్టపడుతుంటే.. హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు
-రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోందన్న భట్టి
-బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు
-తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** జనగామ జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తి చేసుకున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లు, 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మరియు తెలంగాణ విద్యుత్ శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క శంకస్థాపన మరియు ప్రారంభోస్తవ కార్యక్రమం. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం మిగతా2లో



## అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

### సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు.అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మిగతా3లో

## కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు..



### మంత్రి ఉత్తమ్ ధ్వజం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై .. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ కూడా.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ ఇక్కడ యాత్రలు చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్దాలేనని చెప్పారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని– 2లో

# పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార – పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారా వుపేట ఎమ్మెల్యే జారే ఆదినారా యణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి అశ్వారా వుపేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు మిగతా3లో




## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి




2

ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య

## హైదరాబాద్ లో భారీ వర్షం

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



3

## రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు



3

-మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
-ఏదులాపురం మునిసిపల్ పరిధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ కరుణగిరి నూతన శాఖ ప్రారంభం..

తెలంగాణ పత్రిక
GENERAL NEWS

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రు పాషా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు రేవురి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు, భూపాలపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి, కుడా ఛైర్మన్, డిసిసి అధ్యక్షులు, హనుమకొండ జిల్లా ఇనుగాల వెంకట్రాం రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు, జనగామ జిల్లా లకావత్ ధన్వంతి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్, హనుమకొండ చాహత్ బాచ్ పాయ్, సియండి ట్రాన్స్‌కో డి. కృష్ణ భాస్కర్, సియండి టీజీఎన్‌పిడిసిఎల్, వరంగల్ కర్నాటి వరుణ్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీసు, వరంగల్ సన్ ప్రీత్ సింగ్, డిసిపి జనగామ బి.రాజ మహేంద్ర నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ, జనగామ, ఛైర్మన్ మారుజోడు రాంబాబు, ఘనపూర్ (స్టేషన్) మునిసిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఘన్పూర్ (స్టేషన్), ఛైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ గుట్ట దేవస్థానం, ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పల్లగుట్ట గ్రామం, సర్పంచి, ఎనగందుల నర్సింహా రెడ్డి, సాగరం సర్పంచి, మమత చేతన్, కొండాపూర్ సర్పంచి, గుగులోత్ దేవేందర్, కుర్చపల్లి సర్పంచి, బైకాని రాజు, నష్కల్ సర్పంచి రాజుతో కలిసి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖామాత్యులు మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. అనంతరం తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం (60,838) మంది వినియోగదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 132/33 కేవీ పీచర సబ్ స్టేషన్ -- రూ. 43.92 కోట్లు, వేలేరు మండలంలోని పీచరలో 2ఇ10/16 ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్ను, 33/11 కేవీ కొండాపూర్ సబ్ స్టేషన్ -- రూ.2.50 కోట్లు, 33/11 కేవీ సాగరం సబ్ స్టేషన్ -- రూ.2.29 కోట్లు, 33/11 కేవీ కుర్చపల్లి సబ్ స్టేషన్ -- రూ.2.25 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే చిల్పూర్ మండల పరిధిలో రూ. 9.66 కోట్ల వ్యయంతో మూడు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి, పల్లగుట్ట 33/11 కేవీ సబ్ స్టేషన్ -- రూ. 3.25 కోట్లు, లింగంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ -- రూ. 2.81 కోట్లు, నష్కల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ -- రూ. 3.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. తదనంతరం ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించిన రైతు సేవా కేంద్రం స్టాల్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం సభా వేదికపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ఒకప్పుడు వలసలకు నిలయంగా ఉండేదని పేర్కొన్నారు. ఆ పరిస్థితులను మార్చేందుకు ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఏ ప్రాంతంలో నీరు ప్రవహించాలన్నా విద్యుత్ అవసరమేనని స్పష్టం చేశారు. అందుకే విద్యుత్ వ్యవస్థను నిరంతరం ఆధునీకరిస్తూ, అవసరాలకు అనుగుణంగా నవీకరణ చేస్తూ అనేక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శంకుస్థాపనలు చేస్తోందని వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల క్షేమం కోసం ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు, బీఆర్ఎస్, బీజేపీలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు. డిస్కంలను ముంచేసి, ఇప్పుడు కల్లాల్లోకి వస్తామనడం సిగ్గుచేటు. రాష్ట్రం కొంటున్న ధాన్యాన్ని కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు కొనడం లేదు? హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారు. నిరంతరం ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం 'ఇందిరమ్మ రాజ్యం'. త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా రాష్ట్రంలో ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ.రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60 కోట్లతో విద్యుత్ పనులు. బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు.



**రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రాన్ని దోపిడీ చేశారు!**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్ల రూపాయలను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోంది. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ. 76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లం" అని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సొమ్మంతా గత పాలకుల ఇళ్లకే పోయిందని, అందుకే పదేళ్లలో పేదలకు సన్నబియ్యం గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు.

**డిస్కంలను ముంచేసింది మీరు కాదా?: బీఆర్ఎస్‌కు సూటి ప్రశ్న**

పదేళ్ల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప, డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. "మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బంది పడ్డాయి. కానీ, మా ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ. 14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ. 5 వేల కోట్లను.. మొత్తంగా రూ. 19 వేల కోట్లను ప్రతి నెల ఆర్థిక శాఖ ద్వారా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నాం. దీనిపై కూడా అభాండాలు వేయడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనం" అని స్పష్టం చేశారు.

**హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారు!**

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మా క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే.. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారు. గాలి కబుర్లు పోగేసి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారు. అధికారం పోయిందనే తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారు" అని హరీష్ రావుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసిన బీజేపీ!**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. "మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్ సి ఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదు? గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే కొనుగోలు చేసేది. ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు?" అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రం కొన్నా, కొనకపోయినా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మద్దతు ధరతో మొక్కజొన్నలు కొంటున్నారా అని ప్రశ్నించిన ఆయన, కేవలం తెలంగాణలోనే మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

**'తగుదునమ్మా' అంటూ కల్లాల్లోకి వస్తారా?**

రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే.. 'తగుదునమ్మా' అంటూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు? వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర మా కాంగ్రెస్ ప్రభుత్వానిది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

**పేదల గృహనిర్మాణానికి పెద్దపీట**

గత ప్రభుత్వం 'డబుల్ బెడ్‌రూమ్' పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, తొలి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లే లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**మహిళా సాధికారతకు అండ**

మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే, వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు.

**స్థానిక సమస్యలపై సానుకూల స్పందన**

సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యసాధ్యాల (ఖీమ్ముంఅఎఅశ్రీఱ్ఎ ౕబఎఎ) పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి (ాఅఅవ రాష్ట్రఅట్అఅస్త్ర) పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్‌ప్లాన్ నిధులు పెద్ద ఎత్తున వస్తాయని పేర్కొన్నారు. దేవదుల ప్రాజెక్ట్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# జోరు వానను లెక్కచేయని రేవంత్ రెడ్డి



-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యక్రమాలను కొనసాగించారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి' మహాసభలో ఆయన పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ తన సహచర మంత్రులతో కలిసి వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన 553 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. సభ జరుగుతున్న సమయంలో నగరంలో భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను పంపిణీ చేశారు. 'ఇందిరా మహిళా శక్తి' వంటి వినూత్న పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు (టీఎస్ఆర్టీసీ) లీజు ప్రాతిపదికన అందజేస్తారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారైన వస్త్రాలు..సీఎం ప్రశంసలు

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మెడలో ధరించిన కండువాతో పాటు చేతిలో ప్రదర్శించిన చొక్కా కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను శుద్ధి చేసి రూపొందించిన ప్రత్యేక వస్త్రాలతో తయారు చేసినవేనని అధికారులు వివరించారు.ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా,సుస్థిర అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు.ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి,శుద్ధి చేసి,ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో ఫైబర్‌గా మార్చి వాటితో వస్త్రాలను తయారు చేస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.ఈ కార్యక్రమం వ్యర్థాల నిర్వహణలో ఆదర్శప్రాయంగా నిలుస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు.ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తూ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్న సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత విస్తరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వ్యర్థాలను సంపదగా మార్చే ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు..

-మొదటిపేజీ తరువాయి

రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని తెలిపారు. అందుకే కేంద్రం వడ్లు కొనడానికి సుముఖంగా లేదని చెప్పుకొచ్చారు. తాము పండించిన 75లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి మరోసారి లేఖ రాస్తామని తెలిపారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా హార్వెస్ట్ అవుతుందని తెలిపారు. సివిల్ సప్లై ఆఫిస్ నుంచి డైరెక్ట్‌గా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళ సంఘాల అకౌంట్‌లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ. 170కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. 18లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొన్నామని తెలిపారు.క్వింటాకు రూ.1000ల నష్టం రాష్ట్ర ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మొడరనైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోట్లేదని అన్నారు. రేపు మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై రివ్యూ చేస్తామన్నారు. మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఎన్డీఎస్ఏ అధికారులు చెప్పారని తెలిపారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకు పోతాయని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టంగా చెప్పారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు.

-మొదటిపేజీతరువాయి:

## అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్

ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళ కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్ధాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నా' అంటూ పోస్టు పెట్టారు.

## విదేశీ పనిమనుషులపై తెలంగాణ పోలీసుల నిఘా..

తెలంగాణలో నేపాల్ సహా ఇతర దేశాల నుంచి వచ్చి గృహ కార్మికులుగా పనిచేస్తున్న వారిపై రాష్ట్ర పోలీసులు నిఘా పెంచారు. ముఖ్యంగా నేపాలీ పనిమనుషుల వివరాలతో కూడిన సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో నేపాల్‌కు చెందిన కొందరు పనిమనుషులు వరుస నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, భద్రతను పటిష్ఠం చేసేందుకు పోలీస్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో డీజీపీ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గత నెలలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న ఓ విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేసి, నగదు, ఆభరణాలతో పరారైన కేసులో నేపాలీ పనిమనిషి, ఆమె సహచరుల ప్రమేయం ఉన్నట్లు తేలింది. మరో ఉదంతంలో, నేపాలీ దంపతులు యజమానులకు మత్తుమందు ఇచ్చి విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలో ఇప్పటికే 'మీ సురక్ష' కార్యక్రమం ద్వారా 39,000 మందికి పైగా గృహ కార్మికుల వివరాలను సేకరించగా, వారిలో దాదాపు 1,200 మంది నేపాల్‌కు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు. విదేశీ పనిమనుషుల నివాస, ఉపాధి వివరాలను పక్కాగా నమోదు చేయడం ద్వారా వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించడం సులభమవుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. డేటా ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ డేటాబేస్‌ను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా కొత్త వారిని పనిలో చేర్చుకునే ముందు, యజమానులు తప్పనిసరిగా వారి పూర్వాపరాలను పోలీసుల ద్వారా ధ్రువీకరించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

## బాసర గోదావరిలో గల్లంతైన ముగ్గురి మృతదేహాల వెలికితీత

తెలంగాణ పత్రిక ప్రతినిధి:

నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ ఈరోజు (మంగళవారం) గల్లంతై మృతిచెందారు. ఈ ఘటనతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం ఇవాళ వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కొన్ని గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం గజ ఈతగాళ్లు.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు. ముగ్గురు సొంత అన్నదమ్ములేనని అధికారులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన బాసర, కాచిగూడలో తీవ్ర విషాద ఛాయలు నింపగా, స్థానికులను కూడా కలచివేసింది. గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.

# పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా దమ్మపేట మండలంలోని కట్కూరు, వీరభద్రునిగుంపు, పట్వారిగూడెం, మద్దులగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. పట్వారిగూడెం గ్రామంలో రాజుపల్లి గ్రామానికి చెందిన 38 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం రూ.2.22 కోట్ల వ్యయంతో పట్వారిగూడెం ఆర్‌డబీ రోడ్డు నుండి పాకలగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.1.93 కోట్లతో మొద్దులగూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి రెడ్డాలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ నిర్మాణ పనులకు, రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మామిళ్లవారిగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కేవలం తొమ్మిది నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు . అశ్వారావుపేట నియోజకవర్గానికి ప్రత్యేకంగా 4,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కుల, మత, పార్టీ భేదాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ప్రతి అర్హుడికి ఇల్లు అందే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా కొనసాగిస్తున్నామని మంత్రి అన్నారు . రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 99 పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయిస్తామని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతాలైన పూసుకుంటలో , కొండ రెడ్ల, గుత్తి కోయలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించడం ద్వారా పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, ఏటీ సి కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో స్థల సమస్య ఉన్నప్పటికీ ఐదు ఎకరాల్లో గ్రౌండ్ ప్లస్ త్రీ విధానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి స్థలం లేని పేదలకు అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించనున్నాయని తెలిపారు. అత్యాధునిక తరగతి గదులు, హాస్టళ్లు, క్రీడా ప్రాంగణాలు, లైబ్రరీలు, ఇతర సౌకర్యాలతో ఈ పాఠశాలలు నిర్మించబడుతు న్నాయని చెప్పారు. ఈ పాఠశాలలు అందుబాటులోకి వస్తే ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు మడమ తిప్పకుండ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 129 ఎకరాల్లో కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వం చొరవ తో 911 సర్వే నంబర్ పరిధిలో సర్వే పూర్తి అయిందని , 152 సర్వే నంబర్ పరిధిలో జాయింట్ సర్వే నిర్వహించాలని మంత్రిని కోరారు . దొంతికుంట చెరువు ఆధునీకరణకు రూ.5.70 కోట్లతో పనులు చేపడుతున్నామని, పూసుకుంట వంటి గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు . జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, క్రీడా ప్రాంగణాలు, హాస్టల్ వసతులు, కిచెన్, డైనింగ్ హాల్, లైబ్రరీ వంటి అన్ని సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అన్ని శాఖల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అశ్వారావుపేట నియోజకవర్గ విద్యారంగ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, అశ్వారావుపేట మునిసిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, ఆత్మ కమిటీ చైర్మన్,ప్రజాప్రతినిధులు, నిర్మాణ శాఖ పి డి సావేరామ్,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు

-మొదటిపేజీతరువాయి:

రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు.



డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

-తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
-ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా
-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

-మొదటిపేజీతరువాయి:

నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

### హైదరాబాద్‌లో భారీ వర్షం

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి నీ పరామర్శించిన మాజీ జెడ్పిటిసి

కామారెడ్డి ,జూన్ 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)



రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి ని కామారెడ్డి జిల్లా దోమకొండ మండల మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల గౌడ్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఇంద్రక రణ్ రెడ్డి మోకాల చిప్పను సర్జరీ చ ేయించారు. ఈ సందర్భంగా ఆయన కొంపల్లి లో ఉన్న నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య క్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు ఉన్నారు.

# కన్నాపూర్ గ్రామ కార్యదర్శికి ఘన వీడ్కోలు

-కార్యదర్శి సేవలను కొనియాడిన...సర్పంచ్, గ్రామస్థులు.



జగిత్యాల,తెలంగాణ పత్రిక,జూన్ 09

జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించిన ఎలిగేటి ప్రతిభ బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఆమె అందించిన సేవలను గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,నూతన గ్రామ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొని ఎలిగేటి ప్రతిభకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తన విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి గ్రామస్తుల మన్ననలు పొందారని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత

-ఇద్దరు నిందితుల అరెస్ట్!



కామారెడ్డి, జూన్ 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి హన్మంతరావు ఆదేశాల మేరకు మంగళవారం కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబల్పూర్ నుండి నాందేడ్ వెళ్లే 'నాగవలి ఎక్స్‌ప్రెస్' (ట్రైన్ నంబర్: 20809) లో తనిఖీలు చేస్తుండగా.. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు పట్టుబడ్డారు.వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 10 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. నిందితులు మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్ , ప్రవీణ్. నిందితులు ఒడిశాలోని రాయగడలో ఈ ఎండు గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ . సంపత్ కృష్ణ తెలిపారు. చర్యలు: నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విజయవంతమైన తనిఖీలలో ఎక్సైజ్ సీఐ. సంపత్ కృష్ణ, ఎస్ఐ . విక్రమ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, బలవంతరావు, ఫరూఖ్ సిబ్బంది రాజు, పవన్ రెడ్డి, బాబు, శరత్, వందన తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లల్లో దొంగిలించిన సొమ్ముతో ఆన్‌లైన్ షాపింగ్

-అడ్డంగా దొరికిపోయిన మైనర్ బాలురు

కామారెడ్డి ,జూన్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

వయసు చూస్తే మైనర్లు కానీ వారి ప్లాన్‌లు చూస్తే ముదురు దొంగలు కూడా ముక్కున వేలేసుకోవాల్సిందే. సినిమాల ప్రభావం, తల్లిదండ్రుల అతి గారాబంతో దారి తప్పిన ఇద్దరు మైనర్ బాలురు చివరకు పోలీసులకు చిక్కి జువైనల్ హోమ్‌కు చేరారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామంలో జరిగిన ఈ విచిత్ర దొంగతనం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం దేవాయిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ రాత్రి వేళ ఇంటి బయట నిద్రించింది. ఇదే అదునుగా భావించిన ఇద్దరు మైనర్ బాలురు పక్కా స్కెచ్ వేశారు. ఆమె గాఢ నిద్రలో ఉండగా.. గుట్టుచప్పుడు కాకుండా తల కింద ఉన్న దిండు సందులోంచి ఇంటి తాళం చెవిని నొక్కేశారు. ఆ తాళంతో లోపలికి వెళ్లి ఇంట్లోని పెట్టెను ఎత్తుకొచ్చారు. అయితే, దొంగతనం పూర్తి చేశాక.. ఏమాత్రం అనుమానం రావద్దని తాళం చెవిని తిరిగి యథావిధిగా దిండు కింద పెట్టే ప్రయత్నంలో సదరు మహిళకు బాలుర చేయి తగిలింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచిన ఆమె దొంగ.. దొంగ.. అని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మేల్కొన్నారు. దీంతో ఆ మైనర్ బాలుర దొంగతనం గుట్టు రట్టయింది. వెంటనే స్థానికులు రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా మైండ్ బ్లాంక్ అయ్యే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మైనర్లు చలో స్మార్ట్ ఫోన్ వాడుతూ దొంగలించిన డబ్బులతో మీ షో వంటి ఆన్లైన్ షాపింగ్ యాప్స్ లో ఆర్డర్ బుక్ చేసుకొని జల్సాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. చిన్న చిన్న దొంగతనాలతో మొదలుపెట్టి చివరకు ఇళ్లల్లోకి చొరబడే స్థాయికి మైనర్లు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయం ఎప్పుడు వారి ఫోన్లపై నిఘా ఉంచితే బాగుంటుందని మేధావులు సలహా ఇస్తున్నారు.

# అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది

తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 9

తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార ఛ పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఖమ్మం పార్లమెంట్ సభ్యులు దిశా కమిటీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రామసహాయం రఘురాం రెడ్డి , అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ జిల్లా కలెక్టర్ అంకిత్ దమ్మపేట అశ్వారావుపేట మండలాల్లో విస్తృత పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ముందుగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాలైన పూసుగూడెం, కట్కూరులో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు అనంతరం పట్వారిగూడెం నుండి పాకలగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి స్థానిక రైతు వేదికలో రాచూరుపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు అలాగే పట్వారిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని





లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు (నాయుడు పేట) మొద్దులగూడెం గ్రామంలో రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రెడ్యాలపాడు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మొద్దులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో పర్యటించి కొమరం భీం అర్బన్ ఎకో పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణ పనులను ప్రారంభించారు అలాగే కొత్తమామిళ్ల వారిగూడెం గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు , మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి , అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్ జిల్లా మండల స్థాయి ఉన్నతాధికారులు జిల్లా మండల స్థాయి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ విద్య సంస్థలలో మౌలిక వసతులు కల్పించాలి

-ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేయాలి
-ఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్

కామారెడ్డి, జూన్ 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కామారెడ్డి జిల్లా విద్యాశాఖ సంబంధిత అధికారి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వ విద్య సంస్థలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడ లాగే అనుచందంగా ఉంది. విద్యా సంవత్సరం జూన్ 15వ తేదీన అన్ని విద్యాసంస్థలు ప్రారంభమవుతున్నాయి కానీ ఇప్పటివరకు ప్రభుత్వ విద్య సంస్థలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేయాలని అన్నారు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేర్లతో ప్రభుత్వ పాఠశాలలు మూసే ఆలోచనలు ఉందని వారు ఆరోపణ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ నాన్ టీచింగ్ ఎంఈఓ డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికడుతామని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఫీజుల భారం లేకుండా చూస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు తక్షణమే ఆన్లైన్లో పెట్టాలని విద్యాశాఖ అధికారులకు చెప్పిన ప్రతిపాదనలు నేటికీ అమలుకు నోచుకోలేదు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ నేడు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయి. పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆశలను ఆసరాగా చేసుకుని వారికి అనేక మాయమాటలు ప్రచార ఆర్భాటాలతో అరచేతిలో వైకుంఠం చూపించి అడ్మిషన్ చేసుకొని ఆ తర్వాత అడ్మిషన్, బుక్స్ ,స్టేషనరీ, డెవలప్మెంట్, ల్యాబ్, లైబ్రరీ, గేమ్స్ మరియు ఐఐటి, నీట్ ఫౌండేషన్, ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ ఫీజులు అంటూ అనేక రకాల ఫీజుల పేరుతో లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తూ, వారి రక్తాన్ని జలగల్ల జుర్రుకుంటున్న స్థితి నెలకొంది. జిల్లాలో కలెక్టర్, డిఇఓ, స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ తో కలిపి డీ.ఎఫ్.ఆర్.సి. (జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ) సూచనల మేరకు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు నిర్ణయించాల్సి ఉంటుంది. ప్రతి స్కూల్లో ప్రతి తరగతికి సంబంధించిన ఫీజుల వివరాలతో కూడిన బోర్డు కచ్చితంగా ఉండాలి. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యా సంస్థ 25% సీట్లను ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్స్ కల్పించాల్సి ఉంది. కానీ ఏ ఒక్క విద్య సంస్థ కూడా విద్య హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన సిలబస్ ను పక్కనపెట్టి తమ ఇష్టారాజ్యంగా తమ సొంత సిలబస్ రూపొందించుకొని అమలు చేస్తూ బోధిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఒక విద్యా సంస్థ పేరు మీద పర్మిషన్ తీసుకొని, సంబంధిత విద్యాశాఖ అధికారుల వద్ద నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా 4 నుండి 10 వరకు అదనపు బ్రాంచీలు నెలకొల్పుకొని వాటికి డిజి, టెక్నో,ఇ- టెక్నో, ప్లే ,ఐఐటి, మెడికల్ ఫౌండేషన్, గ్లోబల్, లాంటి తోక పేర్లు తగిలించుకొని విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. రెసిడెన్షియల్ పర్మిషన్ లేకుండా హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. కనీసం ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండా అపార్ట్మెంట్లలో, ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కింది నుండి పై వరకు సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే ఆర్థిక తైలాలకు ఆశపడి చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏ ఐ ఏఫ్ డి ఎస్ ఎన్నోసార్లు ఆందోళనలు నిర్వహించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ, ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేయాలని వారు అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎఫ్ డీఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎం ఎస్ఎంఎ) 10వ వార్షికోత్సవం సందర్భంగా

-గుడిపాడు యూపీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారం రాథోడ్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 9

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పి ఎం ఎస్ ఎం ఎ) కార్యక్రమం 10వ వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారాం రాథోడ్ గుడిపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యు పి హెచ్ సి గుడిపాడు)ను సందర్శించి గర్భిణీ స్త్రీల ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా యాంటినేటల్ కేర్ (ఏ ఎన్ సి) క్లినిక్‌లో గర్భిణీలకు అందిస్తున్న సేవలను పరిశీలించి, గర్భిణీల నమోదు, పరీక్షలు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, రిఫరల్ సేవలు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే సంబంధిత రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను తనిఖీ చేసి, సేవల నాణ్యతను మరింత మెరుగు పరచేందుకు అవసరమైన సూచనలు చేశారు. గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన ప్రసూతి పూర్వ సేవలు అందించడం ద్వారా మాతా-శిశు మరణాలను తగ్గించడమే పి ఎం ఎస్ ఎం ఎ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని



డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు ఆరోగ్య ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రతాప్ , డిపిఎమ్ఓ మోహన్ సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలి

**-పోడు భూములకు హక్కు పత్రాలు, అర్హులందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

దమ్మపేట, తెలంగాణ పత్రిక జూన్ 9

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, సాగులో ఉన్న మిగిలిన పోడు భూములకు వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దమ్మపేట మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సంఘం సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విమర్శలు చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే




తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సాధారణ ప్రజలపై భారాలు మోపుతోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను విరమించుకోవాలని కోరారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ.600 కూలీతో పాటు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, కొలతల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయవద్దని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పోడు సాగుదారులపై అటవీ శాఖ అధికారులు వేధింపులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం దమ్మపేట మండల అధ్యక్షుడిగా పిల్లి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొల్లిపోగు శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మంది సభ్యులతో నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, రమేష్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు నియంత్రణ చట్టంపై కాంగ్రెస్ మాట తప్పింది: బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవి గౌడ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

ఎన్నికల సమయంలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు



ఉపశమనం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారి సమస్యలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేసి విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుని ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని, ఫీజుల దోపిడీని అరికట్టాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. "జై తెలంగాణ -- జై కేసీఆర్ -- జై కేటీఆర్" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మట్ట శ్రీనివాస్, సదుల శేఖర్, బైకని వేణుగోపాల్ యాదవ్, బల్యాల ప్రవీణ్, ఎస్.కె. జమీర్, అను మల్ల శివ, గౌడ అనిరుద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలి-మోతె రాజిరెడ్డి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహంపై నల్లగొండలో కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించడాన్ని తెలుగుదేశం పార్టీ వేములవాడ నియోజకవర్గ అడహాక్ కమిటీ సభ్యులు ు టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు మోతె రాజిరెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా మోతె రాజిరెడ్డి మాట్లాడుతూ ఇది చాలా బాధాకరం ఎన్టీఆర్ ను టార్గెట్ చేసి ఇలా చేయడం తెలుగుదేశం పార్టీని రాజకీయంగా ఎదుర్కో లేకపోవడం లాంటి పిరికిపందల చర్యగా మోతె రాజిరెడ్డి వ్యాఖ్యానించారు.తక్షణమే ఈ కుట్రకు పాల్పడిన దుండగులను గుర్తించి క్రిమినల్ చర్యలతో పాటు కఠినంగా శిక్షించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజిరెడ్డి



డిమాండ్ చేశారు.ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే అధికారాన్ని చేపట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత నందమూరి తారక రామారావు దక్కుతుందని ఆయన అన్నారు. నల్లగొండలో కొందరు దద్దమ్మల పిరికి చర్యల వలన తెలుగుదేశం పార్టీ భయపడదని చంద్రబాబు నాయుడు లోకేషలను అభివృద్ధిలో ఎదుర్కోలేని పిరికిపందలు చేతకాని దద్దమ్మలు కుట్రలకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు.ఎన్టీఆర్ ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని ప్రపంచ దేశాలకు తెలుగుజాతి గౌరవాన్ని సాటి చెప్పిన మహనీయుడి విగ్రహానికి నిప్పు పెట్టడం దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మోతె రాజిరెడ్డి కోరారు..

# సాలిడ్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన ఉండాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

సాలిడ్ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. పజా పాలన -- ప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల కార్యాచరణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపాలిటీ డీఆర్‌సీ (డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్)లో సోమవారం సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2026 అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి నూతన సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం డీఆర్‌సీ కేంద్రంలో జరుగుతున్న వ్యర్థాల నిర్వహణ ప్రక్రియలను అధికారులకు ప్రత్యక్షంగా చూపిస్తూ క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యర్థాల నిర్వహణలో భాగస్వామ్యమయ్యే అన్ని శాఖల






అధికారులు కంపోస్ట్ షెడ్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులను గుర్తించి నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన సాలిడ్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో ఉల్లంఘనలు జరిగితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రావణ్, స్వచ్ఛ భారత్ మిషన్ ఐఈసీ కన్సల్టెంట్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల వార్డు అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు వేగవంతంగా పూర్తి చేయాలి జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**-వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.మంగళవారం వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న నిర్వాహకులు, రైతులతో



మాట్లాడి ధాన్యం కొనుగోళ్ళ పురోగతిని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు? ఎంత ధాన్యం మిల్లులకు, గోదాములకు తరలించారు అనే వివరాలపై ఆరా తీశారు. కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, వర్షాల నేపథ్యంలో అందుబాటులో ఉన్న టార్పాలిన్ల వివరాలను ఆరా తీశారు. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు సమకూర్చాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించి లాభదాయక పంటలను సాగు చేయాలని సూచించారు.

# సమయానికి స్పందించిన 108 మహిళ ప్రాణాలు కాపాడిన సిబ్బంది

**-తలపై డ్రెస్సింగ్ టేబుల్ పడడంతో తీవ్ర గాయం**
**-వెంటనే స్పందించిన పైలట్ సునీల్ కుమార్, ఈఎంటీ ఆకాష్**
**-సురక్షితంగా ఆసుపత్రికి తరలింపు**

ఆళ్లపల్లి తెలంగాణ పత్రిక ప్రతినిధి జూన్ 9

ఆళ్లపల్లి మండలం చెలగట్టు గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో 108 అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తత, వేగవంతమైన సేవలతో ఓ మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడింది. గ్రామానికి చెందిన ఈసం నరసమ్మ ఇంట్లో గృహోపకరణాలు సర్దుతున్న సమయంలో అనుకోకుండా డ్రెస్సింగ్ టేబుల్ ఆమె తలపై పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగింది. బాధితురాలి



పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్స్ పైలట్ పరమ సునీల్ కుమార్, ఈఎంటీ ఆకాష్ ఘటనాస్థలానికి చేరుకుని అత్యవసర వైద్య సేవలు అందించారు. రక్తస్రావాన్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రథమ చికిత్స చేసి, అనంతరం బాధితురాలిని అత్యంత జాగ్రత్తగా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు ఆమెకు అవసరమైన చికిత్స అందించి పలు పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం నరసమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సమయానికి స్పందించి సమర్థవంతంగా వైద్య సేవలు అందించిన 108 అంబులెన్స్ పైలట్ పరమ సునీల్ కుమార్, ఈఎంటీ ఆకాష్ సేవలను కుటుంబ సభ్యులు అభినందించారు. వారి చొరవ, అంకితభావం వల్లే నరసమ్మ ప్రాణాపాయం నుంచి బయటపడిందని కృతజ్ఞతలు తెలిపారు.

# ముధోల్ ఊరు పండుగ



ముధోల్:జూన్09(తెలంగాణ పత్రిక)

ఈయేడు వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని అడెల్లి పోచమ్మ (గ్రామ దేవత) కు ఊరు పండుగను ముధోల్ మండల కేంద్రానికి చెందిన రైతులు, గ్రామస్తులు పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు. ముందుగా ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో అడెల్లి పోచమ్మ (గ్రామదేవత) కు మహిళలు బోనాలతో ఇంటి నుండి వండిన పిండి వంటకాలు నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి మేకలను బలి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు గ్రామ దేవతకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారి కి కోరుకున్నామన్నారు. దీంతో మంగళవారం కుల సంఘాల ఆధ్వర్యంలో ఊరు పండుగ నిర్వహించడంతో పండుగ వాతావరణం ఏర్పడింది.

# స్ఫూర్తి, మానసిక దివ్యాంగుల పాఠశాలలో, గుడి కందుల నరేష్ 11

**-వర్ధంతి పురస్కరించుకొని, 25 కేజీ బియ్యం పండ్లు పంపిణీ..**




పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 9 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి పట్టణంలోని, సాగర్ రోడ్డుకు చెందిన, గుడికందుల నరేష్ పదకొండవ వర్ధంతి పురస్కరించుకొని, వారి తల్లిదండ్రులు, గుడికందుల శ్రీనివాస్ గట్టమ్మ దంపతులు, స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో, 25 కేజీ బియ్యం, మామిడి అరటి పండ్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపిటిసి బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, గుడికందుల నరేష్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి తల్లిదండ్రులకు భగవంతుడు, మానసిక ధైర్యం, గుండె నిబ్బరం కలిగించాలని. గత 11 సంవత్సరాలుగా, వారి కుమారుని జ్ఞాపకార్థం, బియ్యం నిత్యవసర వస్తువులు పండ్లు, కూరగాయలు లాంటి, అందజేయడం జరుగుతుంది, వారి తల్లిదండ్రులకు ధైర్యాన్ని కలిపిస్తూ, ఇలాంటి సామాజిక సేవలు చేయడం మంచిదని తెలిపారు.ఈ కార్యక్రమంలో, గుడి కందుల ఓదెమ్మ, గుడికందుల వెంకటేష్, సందీప్, సంతోష్, శ్రీవిజ్ఞ, అట్టే సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు..

## సీఎం సభకు తరలిన ఇల్లంతకుంట వివోఏలు



ఇల్లంతకుంట, జూన్ 9, తెలంగాణ పత్రిక:

హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభకు ఇల్లంతకుంట మండలం నుంచి మండల సమాఖ్య సభ్యులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల వివో ఏలు ఏపీఎం కుమార్ స్వామి ఆధ్వర్యంలో వెళ్లడం జరిగింది.

## ప్రజలకు వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలి

-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 9




వర్షాకాలం నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ముందస్తుగా ఆయిల్ బాల్స్, ఫాగింగ్, యాంటీ లార్వ స్ప్రేలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైన పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాలుగా ఫంక్షన్ హాల్స్, పాఠశాల భవనాలు తదితర సౌకర్యవంతమైన ప్రదేశాలను గుర్తించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.వర్షాకాలంలో నదులు, కాలువలు, చెరువులు, కుంటల సమీప ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు ఎఫ్ ఆర్ ఓకు

## శుభాకాంక్షలు తెలియజేసిన కత్తి స్వామి

గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 9. (తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం లోని ఫారెస్ట్ రేంజ్ అధికారిగా నూతనంగా పదవిబాధ్యతలు చేపట్టిన ప్రసాదరావుని కలిసి, శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ అధ్యక్షుడు కత్తిస్వామి. వారివెంట వెంగంపేట సర్పంచ్ గుగులోత్ జవహర్, మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్, బీసీ జేఏసీ కన్వీనర్ కట్ల భవాని విష్ణు, గుగులోత్ రమేష్, ఆదొండ సాయిలు, చిర్ర నాగరాజు ఈ సందర్భంగా మండల అటవీశాఖాధికారిని శాలువతో సత్కారించి, మండల పరిధిలోని అటవీశాఖఅధికారులకు, అడవిని, అడవిలోని వన్య జీవులను, అటవీ సంపదను, కాపాడడంలో తమవంతు సహాయసహకారాలు అందిస్తామని తెలియజేశారు.

## కొండగట్టు పుణ్యక్షేత్రంలో విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరన

-101 కారులతో చేసే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పిలువు

జగిత్యాల, జూన్ 09, తెలంగాణ పత్రిక.




జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర పోస్టరు ను ఉద్యమ కారుల మంగళవారం ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా ఉపాధ్యాయురాలు మేకల మాధవి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల గౌరవం కేకే కమిటీ వేసినందుకు కమిటీని స్వాగతిస్తూ ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలుపుతూ, ఆదిలాబాద్ నుండి అలంపూర్ 101 కారులతో జోగులంబ పుణ్యక్షేత్రానికి యాత్ర కొనసాగుతుంది. కాబట్టి ప్రతి తెలంగాణ ఉద్యమకారులు ఈ యాత్రలో పాల్గొనవలసిందిగా కోరుకుంటున్ననని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనజ, సత్య, లక్ష్మి,శారద, ఎల్లవ్వ వేములవాడ మండల అధ్యక్షులు తలారి రవి, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణ మహోత్సవం

-భక్తులకు అన్న ప్రసాద వితరణ

కామారెడ్డి ,జూన్ 9,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ కల్కి ఆలయంలో శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది,కళ్యాణ కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది, 500 ల మంది ప్రసాదాన్ని స్వీకరించి అమ్మ భగవానుల ఆశీర్వాదాన్ని స్వీకరించడం జరిగింది, అన్న ప్రసాద వితరణ, కళ్యాణ కార్యక్రమాలకు సహకరించిన దాతలకు ఆశీర్వచనాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, ఎర్రం విజయ్, డాక్టర్ బాలు, సిద్ధంశెట్టి శ్రీనివాస్, పార్శి శ్రీనివాస్, పాత స్వరూప, పప్పుల రాజు శ్రావణి, పబ్బ స్వప్న వేణు, ఎర్రం ప్రసన్న, నాగరాణి, కొమిరిశెట్టి దిగంబర్ పావన, కస్వ వెంకటేష్, శనిశెట్టి శ్రీనివాస్ పద్మ, ఎల్లంకి సుదర్శన్, నంగునూరి కాశీనాథం, జైపాల్ రెడ్డి, లక్ష్మి రాజం, దోమకొండ శ్రీనివాస్, కళ్ళెం సత్యం, కుంభాల లక్ష్మణ్ యాదవ్ లు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, మండల టాపర్ అక్షయకు ఘన సన్మానం

-ప్రతిభను కనబరిచిన అక్షయ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని

-ఈ గుర్తింపు పాఠశాల కుటుంబానికి మరింత ప్రోత్సాహాన్ని అందించిందని

-ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 09 (తెలంగాణ పత్రిక):





వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి విద్యారంగంలో తన ప్రతిభను చాటుకుంది. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం, అలాగే మండల టాపర్‌గా విద్యార్థిని అక్షయ నిలవడం పాఠశాలకు విశేష గౌరవాన్ని తీసుకొచ్చింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో పాటు విద్యార్థిని అక్షయను ఘనంగా సన్మానించారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాలను వంద శాతం ఉత్తీర్ణత సాధింపజేసిన ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యకు కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం అందడం పాఠశాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గర్వకారణంగా నిలిచింది. ఈ విజయం ఒక్కరోజులో సాధించినది కాదని, సాంబయ్య సమర్థ నాయకత్వం, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఫలితంగానే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగామని ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందడం సాంబయ్య విద్యాసేవకు లభించిన గొప్ప గుర్తింపని, ఆయన కృషి పాఠశాల ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని పలువురు ప్రశంసించారు. వెల్దుర్తి మండలానికి మంచి పేరు తీసుకొచ్చిన సాంబయ్య సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండల టాపర్‌గా నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షయను కూడా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఘనంగా సన్మానించారు. 560 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబర్చిన అక్షయకు ఈ సన్మానం ఆమె కృషి, పట్టుదల, లక్ష్యసాధనకు లభించిన గొప్ప గుర్తింపుగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ అసాధారణ ప్రతిభను కనబర్చిన అక్షయ తోటివిద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ అభినందించారు. ఆమె విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహం ఎంతో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు పాఠశాల కుటుంబానికి మరింత ఉత్సాహాన్ని అందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందనే విషయాన్ని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు,విజయ్ మోహన్ రాజ్ అర్చన, జయసుధ, శైలజ, సృజన, ఖదీర్ పాషా, తదితరులు పాల్గొని ,ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య వెల్దుర్తి మండల టాపర్ గా నిలిచిన అక్షయలను అభినందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కూడా ఈ విజయాన్ని హర్షిస్తూ పాఠశాల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం

-గ్రామీణ ప్రజలకు విలువ ఆధారిత అటవీ ఉత్పత్తులపై అవగాహన

-పెద్దపల్లి అటవీ శాఖ రేంజ్ అధికారి సతీష్ కుమార్

పెద్దపల్లి,ప్రతినిధి జూన్09 ( తెలంగాణ పత్రిక )



ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అటవీ ఉత్పత్తుల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు పెద్దపల్లి అటవీ శాఖ రేంజ్ అధికారి సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా అంతర్గాం మండలం కుందనపల్లి, మంథని మండలం ఖాన్సాపేట్ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు?అంతర్గాం మండలం, కుందన్‌పల్లి గ్రామం: అర్బన్ ఫారెస్ట్ పార్కులో స్థానిక గ్రామస్తులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీపురు గడ్డి తేనె, జిగురు, ఇప్ప పూలు వంటి అటవీ ఉత్పత్తుల ద్వారా విలువ ఆధారిత కార్యకలాపాలు, మరియు అర్బన్ ఫారెస్ట్ పార్కు ప్రాంగణంలో వర్మీ కంపోస్ట్ తయారీ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌తో పాటు అటవీ శాఖ సిబ్బంది మరియు 62 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. మంథని అటవీ రేంజ్ అధికారి వినయ్ నాయక్ ఖాన్సాపేట్ గ్రామస్తులకు కూడా అటవీ ఉత్పత్తుల సేకరణ, వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఖాన్సాపేట్ సర్పంచ్, ఉప సర్పంచ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, 38 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అడవులపై ఆధారపడి జీవించే గ్రామస్తులు అటవీ ఉత్పత్తులను సేకరించేటప్పుడు పర్యావరణానికి హాని కలగకుండా, శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అడవుల సంరక్షణతో పాటు, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రీయ ఎరువుల తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని గ్రామస్తులను ప్రోత్సహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొమురయ్య, తిరుపతి, నర్సయ్య, రవి, శ్రీకాంత్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు

## తొలకరి పలకరింపుతో తడిసిన నేల..ఆరుద్రల పరుగులతో మురిసిన పాలం



తెలంగాణ పత్రిక ప్రతినిధి

మృగశిర కార్తె ప్రారంభం కావడంతో తొలకరి చినుకులుతో నేల పరవశించింది. చిన్న చిన్న చినుకులుతో పుడమి పులకరించి.. రైతు పెదవిపై చిరు నవ్వు తో ముఖం వెలిగింది.. అందమైన ఆరుద్రల పరుగులతో ఆ పొలం తల్లి మురిసిపోయింది.. ఇంతకీ ఏంటీ ఇంతలా చెబుతో ంది అనుకుంటున్నారా? తొలకరి చినుకులు పడ్డాయో లేదో పొలంలో అందమైన చిన్న చిన్న ఆరుద్ర పురుగుల సందడి ప్రారంభం అయ్యింది. చేను, సెలక, పొలం గట్లపై పరుగులు తీస్తూ రైతన్నలకు సంబరాన్ని తీసుకొస్తున్నాయి ఈ ఆరుద్ర పురుగులుఈ అందమైన పురుగులు ఎక్కువగా ఆరుద్ర కార్తెలో కనిపిస్తాయి. విత్తనాలు పెట్టి, అవి మొలకగా మారే సమయం ఆరుద్ర కార్తె. ఈ సమయంలో రైతులు అందరూ పొలంలోనే ఉండి పొలం పనులను పూర్తి చేసుకుంటారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుం టాయిఇక తెలుగు పంచాంగం ప్రకారం, జూన్ 22న ప్రారంభమై జూలై5న ఆరుద్ర కార్తె ప్రారంభం అవుతుంది. దీంతో వానలు జోరందుకుంటాయని చెబుతారు పెద్దవారు. మృగశిరలో తొలకరి చినుకులుతో వర్షాలు స్టార్ట్ అయ్యి, ఆరుద్ర కార్తెలో ఎడ తెరిపి లేకుండా కుండపోత వర్షాలు పడతాయి. దీంతో రైతన్న మురిసి వరి నాట్లు వేయడం, పత్తి విత్తనాలు పెట్టడం, కొన్ని చోట్ల మొలకెత్తిన విత్తనాల వద్ద పొలం పనులు చేయడం చేస్తుంటారుఅయితే ఎప్పుడూ ఆరుద్ర కార్తెలో కనిపించే ఈ ఆరుద్ర పురుగులు ఈ సారి ముందుగానే మృగశిర కార్తెలో దర్శనం ఇచ్చాయి. ఇవి చూడటానికి చాలా అందంగా ఎరుపు రంగులో వెల్వెట్ క్లాత్ చుట్టుకున్నట్లు కనిపిస్తుంటాయి. ఇక ఇవి పొలం గట్లపై కనిపిస్తే వాటిని చూసి రైతు సంబరపడి మురిసిపోతాడు. ముఖ్యంగా ఈ ఆరుద్ర పురుగులు పంటలను నాశనం చేయవు. వీటివలన ఎలాంటి హాని ఉండదు. అందుకే చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరికీ ఇవి చాలా ఇష్టం ఉంటుంది.అంతే కాదండోయ్.. వీటికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. ఎవరి పొలంలో అయితే ఇవి ఎక్కువగా కనిపిస్తాయో వారి పొలంలో పంట బాగా పడుతుందని చెబుతుంటారు పెద్దవారు. అందుకే ఇవి పంట చేనులో కనిపిస్తే రైతు సంబరపడిపోతాడు. ఇక ఈ మధ్య కురిసిన వర్షాలకు ఇవి కనిపించి కనువిందు చేస్తున్నాయిఈ పురుగులు పంటలను పాడుచేసే హానికరమైన కీటకాలు, వాటి గుడ్లను ఇవి ఏరిపారేస్తాయి. ఎలాంటి కెమికల్స్ లేకుండానే శత్రు పురుగులను ఇవి అంతం చేస్తాయి. తొలకరి చినుకులు పడగానే కనిపించినఈ ఆరుద్ర పురుగులను చూసి రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడుతున్నారు.



# ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రశ్నిస్తే ఉలికెందుకు

-హరీష్ రావు పై వ్యాఖ్యలనుఖండించిన మాజీ ఎమ్మెల్యేదాసరి మనోహర్ రెడ్డి
-6 గ్యారంటీల హామీ ఏమైంది ఇచ్చింది కాదు. ఎగ్గొట్టిందిచెప్పాలి..

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 9 ( తెలంగాణ పత్రిక )



ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ఉలిక్కిపడాల్సిన అవసరం లేదని పెద్దపల్లి తాజా మాజీ ఎమ్మెల్యే దాసరిమనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత టి. హరీష్ రావు పెద్దపల్లి పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన ప్రశ్నించగా, స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆచరణలో అమలు కాని అనేక హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా హామీలను తప్పించుకుంటోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం జరుగుతోందని, రూ.80,500 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం పెద్ద జోక్ అని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అనేక జిల్లాలకు సాగునీరు అందుతూ పంట దిగుబడులు పెరిగాయని తెలిపారు. 2014-15లో 68.17 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి ఉండగా, 2023-24 నాటికి సుమారు 260 లక్షల టన్నులకు పెరిగిందని ఆయన వివరించారు.రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెట్టే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని, సోలార్ పంపుసెట్ల పేరుతో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రీపెయిడ్ మోటార్ల అంశం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పంపుసెట్లు అంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలు, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఆసరా పెన్షన్ రూ.4,000, రైతు బీమా, రైతు భరోసా వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకుండా తప్పించుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు 1000 రోజులకు దగ్గరపడుతున్నా అమలు దిశగా చర్యలు లేవని విమర్శించారు.గత ఐదున్నర నెలలుగా రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మరణించిన రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందడం లేదని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తే ఇందిరమ్మ బీమా పథకం గురించి చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల ద్వారా గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లో పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక తూకం లేకుండా ధాన్యం కొనుగోలు జరిగిందా అని ప్రశ్నించారు. మిల్లర్లు ట్రక్ షీట్లు మార్చి రైతులకు అన్యాయం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.ప్రతిపక్షంగా ప్రజల సమస్యలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు స్పందించకుండా తొందరపాటుతో వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం తగదని హెచ్చరించారు.హరీష్ రావు ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. అలాంటి నాయకుడిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని, వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని దాసరి మనోహర్ రెడ్డి హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, గర్రెపల్లి పిఏసిఎస్ చైర్మన్ సందీప్ రావు, కాల్వ శ్రీరాంపూర్ మాజీ జెడ్పిటిసి వంగాల తిరుపతిరెడ్డి, ఎలిగేడు మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ సుజాత రవీందర్, నాయకులు మార్కు లక్ష్మణ్, సలేంద్ర రాములు, ముత్యాల రాజయ్య, తీగల సదయ్య, కొయ్యడ సతీష్ గౌడ్, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, స్వామి, కార్తీక్, ఖదీర్ ఖాన్, కొండల్ రాజా, దేవానంద్ శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్, అల్లం సదయ్య, శ్రీనివాస్ రెడ్డి, ముఖీమ్, వహీద్, బాలసాని నరేష్, అజార్, ఆదిల్, అతిక్, శ్రావణ్, రాజేష్, జక్కుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు. ఎమ్మెల్యే బిఎల్ఆర్





-గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులన్నీ సంపూర్ణంగా పూర్తి
-రాష్ట్ర మంత్రుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ ఇళ్లను అధికారికంగా పంపిణీ..

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 9:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణంలో గత కొంతకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులన్నింటినీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించింది. ఈరోజు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో రాజీవ్ గృహ కల్ప పథకం కింద మంజూరైనా ఈ స్థలంలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల నిర్మాణం పేరుతో 10ఏళ్లలో మూడుసార్లు ప్రత్యేక నిధులను మంజూరు చేయించి కూడా పనులు పూర్తిచేయకుండా ఈ ఇళ్ళను పేదలకు చూపించి రాజకీయం చేసే ప్రయత్నాలు చేశారు అని అన్నారు. ఎన్నికల ముందు కనీసం త్రాగు నీరు, రోడ్డు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఓట్ల కోసం డ్రా సిస్టమ్ పెట్టి ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. మేము గత 6 నెలలుగా నిత్యం పర్యవేక్షిస్తూ మంత్రులు, అధికారుల సహకారంతో ఇక్కడ నివసించడానికి కావాల్సిన మౌలిక వసతులను ప్రత్యేక నిధుల ద్వారా పూర్తి చేయడం జరిగింది. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని మౌలిక వసతుల పనులను అధికారులు నాణ్యతతో పూర్తి చేశారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి ఆలస్యం లేకుండా, త్వరలోనే రాష్ట్ర మంత్రుల ముఖ్య అతిథ్యత్వంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకంగా ఈ ఇళ్లను అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సర్పంచ్ బెజ్జం సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి, ఎంఈఓ కి వినతి పత్రం అందజేత

-పాఠ్యపుస్తకాలు మరియు యూనిఫామ్ పేరుతో అదన పోస్టులు చేస్తున్న స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 9:(తెలంగాణ పత్రిక):-



అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ మిర్యాలగూడ మండల సమితి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి ఎంఈఓ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా యశ్వంత్ మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని పుస్తకాలు మరియు యూనిఫాంలో పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారని ఇలా పాల్పడే స్కూల్లో యజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఈ 2026 27 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నందున మిర్యాలగూడ మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాల యజమానులు ఇష్టానుసారంగా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి అధిక ఫీజులు వసుళ్ళకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అదేవిధంగా స్కూల్ యూనిఫామ్ పాఠ్య పుస్తకాలు పాఠశాలలోనే అమ్ముతూ వ్యాపారానికి పాల్పడుతున్నారని వారన్నారు. పేద విద్యార్థులు తల్లిదండ్రులు మా పిల్లలకు మంచి విద్యాభ్యాసాలు అందించాలని వాళ్ల కష్టనష్టాలకు ఓర్చి ప్రైవేటు స్కూలు యాజమాన్యం చెప్పిన విధంగా ఫీజులు కడుతూ ముందుకు పోతున్నారు తమరి ద్వారా ప్రవేటు స్కూలు యాజమాన్యాలకు ఒక సర్కిలర్ జీవో పాస్ చేసి స్కూల్ ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారు. స్కూల్ బోర్డు పై పెట్టే విధంగా చూడాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తున్నది ఒకవేళ అధిక ఫీజులు వసూలు చేసినటువంటి ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారన్నారు. మెమోరాండం ఇచ్చిన వారిలో ఆంగోత్ అనిల్, సీలి వినయ్, పేరుపాక సంతోష్, ఎండి రఫీ, సిహెచ్ కిరణ్, ఏం డి అబ్దుల్, ఏఐవైఎఫ నాయకులు బసక పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసి పోరాట యోధుడు బీర్సముండా 126వ, వర్ధంతి వేడుకలు

-బిర్సముండా పోరాటం ఆదివాసీలకు ఆదర్శం
-సువర్ణ పాక వెంకట రత్నం

గంగారం మండల ప్రతినిధి:- జూన్ 9. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, గంగారం మండల కేంద్రం పరిధిలోని మడ గూడెంలో, ఆదివాసి పోరాట యోధుడు, ఆదివాసి హక్కులకై సంస్కృతి సంప్రదాయాల రక్షణకై, బ్రిటిష్ వారితో సాయిదా పోరాటం నడిపిన ఆదివాసి పోరాట వీరుడు, బీర్సాముండా 126వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం మాట్లాడుతూ... ఆదివాసులు పై జరుగుతున్న భూస్వామ్య దోపిడి, మత మార్పిడీలకు వ్యతిరేకంగా, బ్రిటిష్ వారితో పోరాటం సాగించిన వీరుడు బిర్స ముండా అటవీపై పూర్తి హక్కు ఆదివాసులదేనని తెగించి పోరాడాడు. బిర్స పోరాటం ఆదివాసులకు ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈసం సురేష్, యాప కృష్ణ, తదితరులు పాల్గొని, బీర్సా ముండా కు ఘనంగా నివాళులు అర్పించారు.



# వేములవాడ పుణ్యక్షేత్రంలో విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



రాజన్న సిరిసిల్ల, జూన్ 09,తెలంగాణ పత్రిక.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పుణ్యక్షేత్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర పోస్టరును మంగళవారం ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా ఉపాధ్యాయురాలు మేకల మాధవి, ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కారుపకాల మున్న మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల గౌరవం కేకే కమిటీ వేసినందుకు కమిటీని స్వాగతిస్తూ, ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలుపుతూ, ఆదిలాబాద్ టు అలంపూర్ 101 కారులతో జోగులంబ పుణ్యక్షేత్రానికి యాత్ర కొనసాగుతుంది. కాబట్టి ప్రతి తెలంగాణ ఉద్యమకారులు ఈ యాత్రలో పాల్గొనవలసిందిగా కోరుకుంటున్ననని తెలిపారు.ఐఈ కార్యక్రమం లో కార్యక్రమంలో వనజ,సత్య, లక్ష్మి,శారద, ఎల్లవ్వ, వేములవాడ మండల అధ్యక్షులు తలారి రవి, తదితరులు పాల్గొన్నారు.

# నార్కెట్పల్లి అద్దంకి హైవేపై వడ్లు కొనుగోలు చేయాలని ధర్నాకు దిగిన రైతులు



మాడుగుల పల్లి//నల్గొండ//జూన్ 9:(తెలంగాణ పత్రిక):-

మాడుగులపల్లి మండలం గన్నోని గూడెం ఐకెపిస్ కేంద్రంలో వడ్లు కొనుగోలు ప్రక్రియ నిలిచిపోవడానికి నిరసిస్తూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని కుక్కడం వద్ద నార్కెట్పల్లి అద్దంకి జాతీయ రహదారిపై రైతులు భారీ రాస్తరోక నిర్వహించారు. వేములపల్లి పిఏసిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు అధికారుల నిర్లక్ష్యంవల్ల తాము రోడ్లపైకి రావాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి రోజులు గడుస్తున్న నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఆకాశం మబ్బు పెట్టి ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తడిసిపోతే తాము తీవ్ర నష్టపోతామని రోజుల తర్వాత కేంద్రాల వద్ద పడికాపులు కాస్తూ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రైతులు ఒక్కసారిగా నార్కెట్పల్లి అద్దంకి రా బైఠాయించడం ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక అధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే వడ్లుకొనుగోలు పక్రియ ప్రారంభించి వేగవంతం చేస్తామని అధికారులు గట్టి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు. త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రైతులు హెచ్చరించారు.

# నెల రోజులు గడిచిన జాడ లేని చందుర్తి మండల 108 అంబులెన్స్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక




చందుర్తి మండలానికి సంబంధించిన అంబులెన్సు అందుబాటులో లేక రోడ్డు ప్రమాద బాధితులు గర్భిణీ స్త్రీలు మరియు ఇతర క్షత్తగాత్రులు అత్యవసర సమయంలో 108 అంబులెన్సు కు కాల్ చేయగా దగ్గరలో ఉన్న అంబులెన్సు అందుబాటులో లేదని చెప్పడం ఇంకా వేరే మండలం నుండి వస్తదాని వేచి ఉండాలని చెప్పడం తో క్షత్తగాత్రులు పరిస్థిర్తి విషమించడం తో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పాడుతుంది. మరికొంత మంది క్షతగాత్రులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయంచాల్సి వస్తుంది తక్షణమే చందుర్తి మండల కేంద్రానికి సంబందించిన అంబులెన్సు ను తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆది శ్రీనన్న చొరవ తీసుకుని వెంటనే చందుర్తి లో అంబులెన్సు ఏర్పాటు చేయగలరని మండల ప్రజలు కోరుచున్నారు

# ఐడీఓసీ సెక్షన్ సూపరింటెండెంట్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. భూభారతి, డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలు ఇతర ఆపద సమయాలు, ఇతర అత్యవసర ఇబ్బందుల్లో తగిన సహాయం అందించేందుకు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, సూచనలు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. భూ భారతి దరఖాస్తుల పురోగతిపై ఆరా తీశారు. సమావేశంలో ఏవో రాంరెడ్డి, ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# వార్తల వేటకు విరామం... ప్రకృతి ఒడిలో పాత్రికేయుల పరవశం

-ప్రశ్నించే గొంతులు... కెరటాల మధ్య సేదతీరుతున్నాయి
-ప్రజల కోసం ప్రశ్నించే కలాలు...గోవా తీరంలో ఆనంద క్షణాలు

గోవా జూన్ 09 తెలంగాణ పత్రిక



ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే బాధ్యతతో నిత్యం శ్రమించే శేరిలింగంపల్లి నియోజకవర్గ పాత్రికేయులు కాసేపు తమ వృత్తి ఒత్తిడికి విరామం ఇచ్చి గోవా సముద్ర తీరంలో వేసవి సెలవులను ఆనందంగా గడుపు తున్నారు. అధికారులను ప్రశ్నించే స్వరాలు, అవినీతిపై అక్షర యుద్ధం చేసే కలాలు, ఇప్పుడు సముద్ర కెరటాల సంగీతాన్ని ఆస్వాదిస్తూ ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నాయి. నిత్యం వార్తల కోసం పరుగులు పెట్టే జర్నలిస్టులు ఇసుక తీరంలో సందడి చేస్తూ, సముద్ర అలలతో మమేకమవుతూ ఉల్లాసభరిత క్షణాలను ఆస్వాదిస్తున్నారు. ప్రజా చైతన్యానికి అక్షరాలను ఆయుధాలుగా మలిచిన ఈ కలం యోధులు, కొద్దిసేపు వార్తల ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందాల మధ్య ప్రశాంతతను వెతుక్కుంటూ కనిపించడం విశేషం. కెరటాల గర్జన మధ్య స్నేహితులతో సరదా సంభాషణలు, ప్రకృతి అందాల నడుమ జ్ఞాపకాలుగా మిగిలిపోయే క్షణాలు గడుపుతూ, మరింత ఉత్సాహంతో తిరిగి ప్రజా సేవలో నిమగ్నం కావడానికి సిద్ధమవుతున్నారు..

# ఖమ్మం ఘటనపై మాజీ ఎంపీ నామ ఆగ్రహం

-నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్..



తెలంగాణ పత్రిక:

ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటనపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం చేసి భవనం పై నుంచి తోసేయడం అమానుషమని ఖండించారు. చిన్నారులపై ఇలాంటి పైశాచిక దాడులు సభ్యసమాజం తలదించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి అత్యంత కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేరస్తుల గుండెల్లో భయం పుట్టేలా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక వేధింపులు

-నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష
-సమాజంలో నేరం చేసిన వారు తప్పించుకోలేరు..
-ఎస్పీ మహేష్ బి గితే

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం వెల్లడించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరింటాల గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధించగా, బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు



మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది కీలక పాత్ర పోషించారు. మొత్తం 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ నేరం రుజువైందని నిర్ధారించి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, నేరాలకు కఠిన శిక్షలే సమాజంలో మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయపరమైన చర్యలు పకడ్బందీగా చేపట్టి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో విశేష కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, మాజీ డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

-రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

తెలంగాణ పత్రిక, సూర్యాపేట, జూన్ 9

సూర్యాపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ కొప్పుల వేణారెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మార్కెట్ అభివృద్ధి, రైతులకు అందించాల్సిన సౌకర్యాలు, రానున్న సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లపై డైరెక్టర్లతో విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు. రైతులకు



మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గుర్తింపు, క్రమశిక్షణ మరియు వృత్తిపరమైన విధానాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో యూనిఫారాలు అందించుటపై సమావేశంలో సభ్యులు చర్చించారు. కార్మికులందరికీ ఒకే విధమైన యూనిఫారాలు అందించడం వల్ల మార్కెట్‌లో నిర్వహణ సులభతరం కావడంతో పాటు వారి సేవలకు మరింత గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఫసియోద్దీన్ (ముక్రం), డైరెక్టర్లు ఆర్తి కేశవులు, చెన్నోజు నర్సింహాచారి, నకిరేకంటి బాలకృష్ణ, పచ్చిపాల వెంకన్న, షేక్ అబ్దుల్ కరీం, మాద్గుల నవీన్, ఉప్పల సత్యనారాయణ, మెడిమేలపు దామోదర్ రెడ్డి, గోపగాని పెద్ద వెంకన్న, దాసరి తిరుమలరావు, గోగుల పద్మ సత్తిరెడ్డి, యూడీసీ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల దోపిడీ అరికట్టాలి

-ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతులు కల్పించాలి
-గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలి
-పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
-ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ డిమాండ్

పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 9 ( తెలంగాణ పత్రిక )

ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, ప్రహరీ గోడలు, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి ప్రాథమిక మౌలిక వసతులు అనేక చోట్ల సరిపడా లేవు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను తక్షణమే కల్పించవలసిందిగా కోరుతు న్నాము. అదేవిధంగా, జిల్లాలోని కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తు న్నాయి. ఫీజుల వివరాలను పారదర్శకంగా వెల్లడిం చకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థి తులు కనిపిస్తున్నాయి. అలాగే, కొన్ని పాఠశాలలు



విద్యార్థులు తప్పనిసరిగా తమ వద్ద నుంచే లేదా నిర్దిష్ట దుకాణాల నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అక్రమంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు నిర్వహిస్తు న్నాయి. ఈ చర్యలు తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయి. ఇంకా, ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా నిర్వహించబడుతున్న పాఠశాలలను గుర్తించి, వాటిపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయవలసిందిగా కోరుతున్నాము. లేని యెడల రానున్న రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, నాయకులు అజయ్, విగ్నేష్, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు

## అయ్యవారిపేట గ్రామంలో,కాపేడు స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన, ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ మహిళకు సర్టిఫికెట్ల ప్రదానం

వాజేడు తెలంగాణ పత్రిక ప్రతినిధి కీసరి ప్రసాద్

వాజేడు మండల కేంద్రంలోని అయ్యవారిపేట, గ్రామ లోనే ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్. ములుగు జిల్లా పరిధిలోని కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అయ్యవారిపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత మిషిని శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు 23 మంది మహిళలకు ఈ రోజు ఘనంగా సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల విద్యార్థులు, యువతలోనైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో కాపేడు సంస్థ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సుమారు 23 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేయబడ్డాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయ్యవారిపేట , సర్పంచ్,,బెనినీ గారు చింతూరు, సర్పంచ్ గారు, హాజరై సర్టిఫికెట్లు అందజేశారు. కాపేడు డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజు గారు మహిళలకు అభినందించి వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్



యుగంలో ప్రతి మహిళలకు ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ అత్యంత అవసరమని, ఈ శిక్షణ ద్వారా మన సర్టిఫికెట్ ద్వారా గవర్నమెంట్ పథకాలు పొందవచ్చు అని చెప్పడం జరిగింది. అవకాశాలను పొందడంతో పాటు ఉన్నత స్థాయిలో కూడా ఎదగవచ్చని చెప్పడం జరిగింది. అందరూ మరింత ముందుకు సాగగలరని తెలిపారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల యువత, యువకులకు, ఎక్కువగా .నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా వారిని ఆధునిక ప్రపంచంతో అనుసంధానం చేయడం కాపేడు సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అందుకున్న మహిళలందరికీ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమకు ఉచితంగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందించి విలువైన నైపుణ్యాలను నేర్పిన కాపేడు సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ తమ కుటుంబానికి మరియు మన పిల్లల భవిష్యత్తు కూడా అవకాశాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ జయరాజ్ ,కాపేడు కో-ఆర్డినేటర్లు జి కామేష్,గారు, గారు పాల్గొన్నారు. అదేవిధంగా సంస్థ సిబ్బంది ఉషా, రామదేవి, పద్మ, ఇందిర, స్వరూప, సుజల, భాస్కర్, నరేష్, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కల్పన కోసం కాపేడు సంస్థ భవిష్యత్తులో కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను కొనసాగిస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఏఎన్ఎంల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

**-సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 9



జిల్లాలోని పిహెచ్సీలలో ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఏఎన్ఎం ల మూడు నెలల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ పిపి యూనిట్ లో పనిచేస్తున్న ఏఎన్ఎం లను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటి జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు మాట్లాడుతూ గత మూడు నెలల నుండి ఏఎన్ఎం లకు రావలసిన జీతాలు విడుదల చేయక ఏఎన్ఎంలు కుటుంబ పోషణకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర జీవితంలోనే వారి యూనిఫారాలు కూడా కొనుక్కోమని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే ఏఎన్ఎం లకు యూనిఫాం అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు పని భద్రత లేదని వారికి పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యం కూడా సక్రమంగా అమలు కావట్లేదని ఆరోపించారు. అధికారులు వీరితో చాకిరి చేయించుకోవడమే తప్ప వారి జీతాల కోసం వారి భద్రత కోసం ఏమాత్రం పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. మూడు నెలలుగా జీతాలు రాకపోయినా పట్టించుకోని జిల్లా అధికారులు పనిచేయాలంటూ ఏఎన్ఎంలపై తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని దీని వలన ఏఎన్ఎంలు మానసిక ఇబ్బందులకు కూడా గురవుతున్నారని ఆరోపించారు. జిల్లాలోని పిఎస్సీలలో పనిచేస్తున్న ఏఎన్ఎం లకు పెండింగ్ జీతాలు తక్షణమే విడుదల చేసి వారికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు యూనిఫామ్ అలవెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వం పట్టించుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి సోనియా అనిత శ్రీ సమ్మక్క భవాని జ్యోతి.

# నీళ్లు రావడం లేదని వాటర్ ట్యాంక్ ఓపెన్ చేసిన ఓనర్ కట్‌చేస్తే.. లోపల సీన్ చూసి గుండె గుభేల్

తెలంగాణ పత్రిక ప్రతినిధి



సరిగ్గా వర్షాకాలం ప్రారంభం అవుతున్న సమయంలో ఇటువంటి ఘటనలు జరగడం పట్ల అటవీ శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇళ్ల చుట్టుపక్కల ఉండే నీటి ట్యాంకులు, నిల్వ ఉంచే డ్రమ్ములపై మూతలు కచ్చితంగా, గట్టిగా ఉండేలా చూసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా, తాగే నీటి ట్యాంకులో అన్ని పాములు ప్రత్యక్షం కావడం ఇప్పుడు సోషల్ మీడియాలోనూ సంచలనంగా మారింది. మనం నిత్యం తాగేందుకు, ఇంటి అవసరాలకు ఉపయోగించే నీటి ట్యాంకులో ఏముంటుంది? మహా అయితే కొద్దిగా బురద లేదా నాచు ఉంటుంది. కానీ, ఉత్తరాఖండ్‌లోని ఒక ఇంట్లో వాటర్ ట్యాంక్ తెరిచి చూసిన కుటుంబ సభ్యులకు మాత్రం గుండె ఆగిపోయే అంత పని అయింది. ఆ ట్యాంకు లోపల ఏకంగా డజన్ల కొద్దీ పాము పిల్లలు ఈదుకుంటూ కనిపించాయినీటి తొట్టెలో వింత కదలికలు.. తీరా చూస్తే..! ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ జిల్లా పరిధిలోని సరాయ్ గ్రామంలో ఈ ఒళ్ళు గగుర్పొడిచే సంఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ఒక కుటుంబం తమ ఇంటి నీటి నిల్వ ట్యాంకును సాధారణంగానే పరిశీలించింది. అయితే, ట్యాంకు లోపల ఏదో వింతగా కదులుతున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు, నిశితంగా లోపలికి తొంగి చూశారు. అంతే.. అక్కడ కనిపించిన దృశ్యానికి వారి నోట మాట రాలేదు, ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. చిన్న చిన్న పాము పిల్లలు గుంపులుగా ఆ నీటిలోనే తిరుగుతూ కనిపించాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆ కుటుంబం వెంటనే ఇరుగుపొరుగు వారికి అందించిందిరంగంలోకి దిగిన అటవీ శాఖ, స్నేక్ క్యాచర్లు.. ఇంట్లో పాములు ఉన్నాయన్న వార్త లంక దహనంలా గ్రామం మొత్తం వ్యాపించింది. దాంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులను ఆశ్రయించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న రేంజ్ ఆఫీసర్ శిశ్‌పాల్ సింగ్ తన సిబ్బందితో పాటు తాలిబ్, భోలా అనే నైపుణ్యం గల ఇద్దరు పాములు పట్టే నిపుణులను వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిపుణులు అత్యంత జాగ్రత్తగా ఆ నీటి ట్యాంకు లోపల ఉన్న పాములను ఒక్కొక్కటిగా బయటకు తీసే ప్రక్రియను ప్రారంభించారు.

# అధిక దిగుబడులు వస్తాయని నమ్మించారు..నట్టేట ముంచారు

**- 160 ఎకరాలలో నష్టపోయిన రైతులు**
**- పైనీర్915 కంపెనీ ఆర్గనైజర్ల మోసం**
**- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతులు**
**- ఎకరానికి 40 కింటలు వస్తాయని నమ్మించారు**
**- కేవలం 10 నుంచి 15 కింటాలు మాత్రమే వచ్చాయి**

ఆత్మకూరు, జూన్ 09: (తెలంగాణ పత్రిక):



పైనీర్ 915 మేల్, ఫిమేల్ నకిలీ విత్తనాలను అధిక దిగుబడులు వస్తాయంటూ నమ్మించి నట్టేట ముంచారని బాధిత రైతులు పోలీసులు గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామ రైతులకు పైనీర్ 915 మేల్, ఫిమేల్ కంపెనీ ఆర్గనైజర్లు కోడారి సమ్మయ్య, ఇందూరి మచ్చేందర్, కొన్నే సూరయ్య లు రైతులతో సమావేశాలు పెట్టి మేల్ , ఫిమేల్ విత్తనాలు వేస్తే మేమే క్వింటాలకు రూ. 3600 లతో కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చి నమ్మించారు. మేము ఇచ్చే విత్తనాలు వేస్తే ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులకు ఆశ చూపడంతో 160 ఎకరాల్లో మేల్, ఫిమేల్ నకిలీ విత్తనాలతో రైతులు సాగు చేశారు. ఎంతో ఆశతో మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా పంటలకు నీరందించి ఎరువులు వేసినా కూడా ఎకరానికి 10 నుంచి 15,17, 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు లబోదిబో మంటూ పైనీర్ 915 కంపెనీ ఆర్గనైజర్లు, కొడారి సమ్మయ్య, ఇందూరి మచ్చేందర్, కొన్నే సూరయ్యల కు ఫోన్ చేసి మాకు జరిగిన నష్టాన్ని పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరగా మేము వస్తామని పంటను పరిశీలించిన తర్వాత మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన గడువు లోపు రాకపోవడంతో తిరిగి మళ్లీ ఫోన్ చేస్తే మేము ఏమీ చేయలేం 'మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండని రైతులను దబాయించారని రైతులు నేరెళ్ల రమణారెడ్డి, ఎన్.రవీందర్, రాజేందర్,మాదాసి కర్ణాకర్,కరుణాకర్ రెడ్డి ,విజేందర్ , గుండాల క్రాంతి సురేష్, సాంబరాజు, రమేష్, మహేందర్, పురం కుమారస్వామి,ప్రభాకర్ తదితర బాధిత రైతులు ఆవేదనవ్యక్తం చేశారు. దీంతో ఆర్థికంగా నష్టపోయిన 160 ఎకరాల బాధిత రైతులు ఆత్మకూరు ఎస్సై తిరుపతి ని ఆశ్రయించి జరిగిన నష్ట వివరాలను కంపెనీ ఆర్గనైజర్లు మమ్ములను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మీరే న్యాయం చేయాలంటూ ఎస్సై ముందు వారు గోడు వెళ్లబోసుకున్నారు. కంపెనీ నుంచి మాకు నష్టపరిహారం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్సై ని రైతులు వేడుకున్నారు. 15 రోజుల లోపు వస్తామని కంపెనీ ఆర్గనైజర్లు రాకుండా పోవడమే గాక పోన్ చేస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండని ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ బెదిరిస్తున్నారని ఏస్సైకి వివరించారు. పండించిన పంటను రూ.3600లకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి పండిన తక్కువ దిగుబడిని కూడా రూ.2800ల చొప్పునే కొనుగోలు చేసి రైతులను ఆర్థికంగా దెబ్బతీశారని ఎస్సై ముందు వాపోయారు. ఎలా ఉన్నా కూడా ఎకరానికి లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు.మీరు మాకు న్యాయం చేయకుంటే ఆర్థికంగా నష్టపోయిన మేము పంటలకు పెట్టుబడి పెట్టే పరిస్థితుల్లో లేమని చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్సైని కోరారు. రైతులతో పాటు మండల కిసాన్ సెల్ అధ్యకుడు రేషూరి జైపాల్ రెడ్డి స్థానిక నేరెళ్ల కరుణాకర్రెడ్డితో పాటు రైతులు ఉన్నారు.

# వాడపల్లి గ్రామంలో అద్దంకి నార్కెట్పల్లి రహదారిపై రెండు బైకులు ఢీకొని ముగ్గురు మృతి

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 9:(తెలంగాణ పత్రిక):-



నల్గొండ జిల్లా అద్దంకి నార్కెట్పల్లి జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన నర్సింహారావు, ధనుంజయరావు పని నిమిత్తం దక్కన్ ఫ్యాక్టరీ కి వెళ్తున్నారు. వాడపల్లి ప్రాంతానికి హైవేపై ఎదురుగా వచ్చిన బైకర్ దాచేపల్లి మండలానికి చెందిన వ్యక్తి అతివేగంగా వీరి బైక్ ను ఢీకొనగా తీవ్ర గాయాలైన నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందారు. అతనితో పాటు దాచేపల్లి కి చెందిన యువకుడు కూడా ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు తీవ్ర గాయాలైన ధనుంజయరావును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్య లో మృతి చెందాడు. వారం రోజుల క్రితమే రాసి సిమెంట్ ఫ్యాక్టరీలో లోడింగ్ కు వెళ్లి తిరిగి వస్తున్న వ్యక్తిని లారీ ఢీకొని మృతి చెందగా ఇది రెండో రోడ్డు ప్రమాదం వాహనదారులు రోడ్డుపై జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చింతల్ చెరువు కట్టను మింగేస్తున్న కాంక్రీట్ జంగిల్ అధికారుల కళ్లు ఎందుకు మూసుకున్నాయి?

**-కొత్తగూడెం-హైదరాబాద్ హైవే ముంపు ముప్పు.. వర్షాకాలానికి ముందే మేలుకోండి**



కొత్తగూడెం, జూన్ 9:(తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి ఊపిరిలాంటి చింతల్ చెరువు కట్టకు అతి దగ్గరగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు రెండో కట్టలా పైకి లేస్తున్నాయి. 08/06/2026న తీసిన ఫోటోల్లో భారీ తవ్వకాలు, బేస్మెంట్ లెవెల్ స్టీల్ పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వర్షాకాలం అడుగుపెట్టబోతున్న తరుణంలో ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటమే అవుతుందని స్థానికులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బఫర్ జోన్‌లో బుల్డోజర్ల హోరు**

చెరువు ఖీబశ్రీశ్రీ ఝఅని ాావజవశ్రీ - ఖీూ నుంచి 30 మీటర్ల వరకు ఉండే ప్రాంతం చట్టప్రకారం బఫర్ జోన్. +ూ చీశీ. 111 ప్రకారం ఈ జోన్‌లో నివాస, వాణిజ్య నిర్మాణాలతో పాటు అండర్ గ్రౌండ్ తవ్వకాలు కూడా నిషేధం. కానీ చింతల్ చెరువు కట్టను ఆనుకుని, స్టేట్ హైవేకు ఆనుకునే ప్లాట్లలో బహుళ అంతస్తులకు పునాదులు పడుతున్నాయి. రోజుల తరబడి జేసీబీలు, కాంక్రీట్ మిక్సర్లు పని చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు మాత్రం "చూడనట్లు" వ్యవహరిస్తున్నారు.

**ఎవరి అండతో ఈ అక్రమాలు?**

ఒక్క ఫోటో చూస్తేనే ఇది చిన్న కట్టడం కాదని అర్థమవుతుంది. అంత భారీ యంత్రాలు, మెటీరియల్ సైట్‌కు వస్తుంటే అధికారులకు తెలియదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. "స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు" అని పేరు చెప్పడానికి ఇష్టపడని స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరి వెనుక ఎవరి ప్రోత్సాహం ఉందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**వర్షం వస్తే హైవేనే నది అవుతుంది**

కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే స్టేట్ హైవే చింతల్ చెరువుకు ఆనుకునే ఉంది. గత వర్షాకాలంలో ఈ రోడ్డు పూర్తిగా జలమయమై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిన సంఘటనలు మనం మర్చిపోలేదు. బఫర్ జోన్‌లో కాంక్రీట్ కట్టడాలు వస్తే వర్షపు నీరు చెరువులోకి చేరే వాగు, వంక మార్గాలు మూసుకుపోతాయి. ఫలితంగా వరద నీరంతా హైవేపైకి వచ్చి వాహనదారుల ప్రాణాలకు ముప్పు, చుట్టుపక్కల కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదం తప్పదు.

**ఇది ఒక ఇల్లు కూలితే సమస్య కాదు.. ఊరే మునిగే ప్రమాదం**

పర్యావరణవేత్తల మాటల్లో చెప్పాలంటే: 1. కట్ట బలహీనపడి తెగిపోతే కింద ఉన్న వందల ఇళ్లు కొట్టుకుపోతాయి. 2. చెరువు నిండక గ్రౌండ్ వాటర్ లెవెల్ పడిపోతుంది. 3. ఎవీణూ పరిధిలో కూడా ఇలాంటి అక్రమాలకు ఉదాహరణగా నిలిచి భవిష్యత్‌లో మరిన్ని కబ్జాలకు దారి తీస్తుంది.

**ఇప్పటికైనా మేల్కొనండి.. సమాధానం చెప్పండి**

ఈ సమస్యకు పరిష్కారం ఒక్కటే. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ాాజు, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పాట్ విజిట్ చేసి ఖీూ మ్యాప్‌తో పోల్చి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి. అనుమతులు ఇచ్చిన అధికారులు, ప్రోత్సహించిన ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రజలు కూడా http://dharani.telangana.gov.in లో 'Lake Information System' ద్వారా తమ ప్లాట్ ఖీూ/బఫర్ జోన్‌లో ఉందో లేదో చెక్ చేసుకోవాలి. కంప్లైంట్ చేయండి: కొత్తగూడెం మున్సిపాలిటీ కంట్రోల్ రూమ్ - 08744-222, ఇరిగేషన్ టోల్ ఫ్రీ - 1800-599-5003 ఫోటో: 08/06/2026న చింతల్ చెరువు బఫర్ జోన్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ నిర్మాణం

# ప్రతి స్టాక్ పాయింట్ లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ

**-రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బుకింగ్ యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా పంపిణీ**
**-ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలు తనిఖీ**



తెలంగాణ పత్రిక:
జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లి లో గల ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపి, యాప్ వల్ల సమకూరే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని అన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు.నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 27 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. పలు సొసైటీలు డిఫాల్ట్ లో ఉండగా, వాటి పరిధిలోని రైతులకు సైతం ఇబ్బందులు తలెత్తకూడదని, స్థానికంగానే వారికి ఎరువులు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో డీ.సీ.ఎం.ఎస్ ద్వారా ఎరువుల పంపిణీ జరిపిస్తున్నామని అన్నారు. ఒకింత ముందుగానే పంటలు విత్తుకునే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని, తదుపరి నిజామాబాద్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలో కూడా పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ చైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**-పోస్టర్ విడుదల చేసిన బేరి రామచంద్ర యాదవ్.**

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జూన్ 09.
భవన కార్మికుల సేవా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి అనంతయ్య నివాసం దగ్గర మంగళవారం ఉదయం 11 గంటలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల ఆరాధ్య దైవము భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద



ఎత్తున తరలివచ్చి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు ఉప్పరి కృష్ణయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.అనంతయ్య , గంట సుదర్శన్ తెలంగాణ రాష్ట్ర బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ జయంతుల ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్, ఓయూ విద్యార్థి లీడర్ ఎం కుమార్ అరుణ్ కుమార్ నాగరాజు, లక్ష్మీదేవిపల్లి గోవు సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొని పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ నెల 13 - 06-2026 నాడు మాటు గూడెం గ్రామానికి పూడూరు మండల్ వికారాబాద్ జిల్లా సాయంత్రం నాలుగు గంటలకు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందనీ, విగ్రహావిష్కరణకు అందరూ ఆహ్వానితులేనని కార్యక్రమంలో పాల్గొనాలని బేరి రామచంద్ర యాదవ్ తో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

# పాలేరు ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం





**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
**-రైతులకు అందుబాటులో బ్యాంకింగ్ సేవలు..**
**-దేశంలోనే 20 వేల కోట్ల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం..**
**-ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయం సాధించే దిశగా రైతులు అడుగులు వేయాలి..**
**-చెరువుమాదారం డిసిసిబి బ్యాంక్ బ్రాంచ్ ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి**

తెలంగాణ పత్రిక:
పాలేరు ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసి రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన వ్యవసాయ ప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. నేలకొండపల్లి మండలం చెరువు మాదారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) శాఖను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో డీసీసీబీ బ్యాంకు శాఖ ఉండాలనే ఉద్దేశ్యంతో చెరువు మాదారం గ్రామంలో నూతన సహకార బ్యాంకు శాఖను ప్రారంభించామని తెలిపారు. సహకార బ్యాంకులు రైతులకు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రజలందరికీ మెరుగైన ఆర్థిక సేవలు అందిస్తున్నాయని అన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో సాగునీటి వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేశామని, ఇక్కడ అన్ని విధాలుగా కష్టపడే రైతులు నివసిస్తున్నారని అన్నారు. పాలేరుకు ఉన్న నీటి సౌకర్యం తెలంగాణ రాష్ట్రంలో మరే నియోజకవర్గానికి లేదని తెలిపారు. నిజాం హయాంలో నిర్మించిన పాలేరు రిజర్వాయర్, కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో నిర్మితమైన నాగార్జునసాగర్, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పూర్తవుతున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు పాలేరు ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలం చేస్తాయని పేర్కొన్నారు. కొండలను దాటుకుంటూ సొరంగాల ద్వారా గోదావరి జలాలు పాలేరు వైపు అడుగులు వేస్తున్నాయని తెలిపారు. కాలువలు, టన్నెల్ నిర్మాణాలపై గత పాలకులు నిర్ణయాలు తీసుకోకుండా పనులను పెండింగ్లో ఉంచారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ డిమాండ్ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్టుకు అదనంగా 4,800 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. పాలేరు రిజర్వాయర్కు గోదావరి జలాలు రావాలంటే జూలూరుపాడు టన్నెల్ పూర్తి కావాలని, ఆ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సత్తుపల్లి ట్రంక్ యాతాలకుంట టన్నెల్ పనులు ఇటీవల పూర్తయ్యాయని, జూలూరుపాడు టన్నెల్ను కూడా ఏడాది వ్యవధిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు లక్ష కోట్ల రూపాయలు జమ చేశామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒకే సంవత్సరం లో 20 వేల కోట్ల రుణమాఫీ జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మాత్రమే అది సాధ్యమైందన్నారు. ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ రూ.20 వేల కోట్ల రుణమాఫీ, దేశంలో అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, జొన్నల వంటి పంటలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా కొంతమంది రైతులు తెలంగాణకు వచ్చి తమ పంటలను విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. డీజిల్, యూరియా సరఫరాలో జాతీయ స్థాయిలో సమస్యలు ఎదురైనప్పటికీ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈ యాసంగి సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ స్థాయిలో కొనుగోలు చేయలేదని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతు సమస్యలను ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు సమయం వచ్చినప్పుడు ఆశీర్వదించాలని కోరారు. ఈ ఏడాది ఎల్నినో పరిస్థితులు ఏర్పడే అవకాశముందని, వర్షపాతం తగ్గే అవకాశాలపై వాతావరణ శాఖ హెచ్చరిస్తోందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షపాతం పరిస్థితులను బట్టి ఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు ఇస్తారని, వారికి రైతులు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామం, మండలానికి సంబంధించిన వాతావరణ సమాచారాన్ని మొబైల్ యాప్ ద్వారా రైతులకు అందించే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అవసరమైన మేరకు సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలని, అధిక ఎరువుల వినియోగం భూసారాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్తో పాటు అధిక ఆదాయం వచ్చే ఇతర పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రోజుల్లో పాలేరు ప్రాంతంలో ఎకరం భూమి రూ.50 వేలకే లభించేదని, ప్రస్తుతం రూ.50 లక్షలకు తక్కువ ధర ఎక్కడా లేదని తెలిపారు. ఒకప్పుడు పేదరికానికి ప్రతీకగా ఉన్న పాలేరు నేడు సంపన్న నియోజక వర్గంగా మారిందని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పూర్తి చేసుకుంటామని తెలిపారు.రైతుల భద్రత, రహదారుల పరిరక్షణ దృష్ట్యా కేజీ వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడపరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమీషనర్ ను ఆదేశించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతంలో సహకార బ్యాంకులు కేవలం రైతులకు మాత్రమే పరిమితమనే అభిప్రాయం ప్రజల్లో ఉండేదని అన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రధాన మండల కేంద్రంలో కొత్త శాఖలను ఏర్పాటు చేస్తూ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. కమర్షియల్ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులతో పోటీగా సహకార బ్యాంకులు కూడా ఆధునిక సేవలు అందిస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం నుంచే సహకార రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ఈ మార్పు సాధ్యమైందని అన్నారు. పాలేరు నియోజక వర్గ పరిధిలో రెండో డీసీసీబీ శాఖ ప్రారంభించడం సంతోషకరమని, దీనికి సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం డీసీసీబీ 54వ శాఖను ప్రారంభించడం సంతోషకర మన్నారు. గ్రామీణ ప్రజలు, రైతులకు ఈ బ్యాంకు సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. శాఖ విస్తరణకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒక సారి బ్యాంకర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి డీసీసీబీ బ్యాంకులు అధికంగా రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. రైతులు కూడా రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తూ బ్యాంకు ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం డీసీసీబీ రూ.5 కోట్ల లాభాలను నమోదు చేసిందని తెలిపారు. బ్యాంకు అభివృద్ధి ఇదే విధంగా కొనసాగి మరింత మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని ఆకాంక్షించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి సిఈఓ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, డిసిఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములను సందర్శించిన కలెక్టర్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 09, తెలంగాణ పత్రిక





ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, హమాలీల సంఖ్యను పెంచి, అన్ లోడింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ చేస్తున్న తీరును అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.వాహనాల్లోని ధాన్యం హమాలీల సంఖ్యను మరింత పెంచి అన్ లోడింగ్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని, అన్ లోడ్ అయిన వాహనాలను ధాన్యం లోడింగ్ కోసం ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తున్న తీరు, గోదాముల సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుండి వాహనాలను జాప్యం చేయకుండా లోడింగ్ చేసి తరలించేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.సందర్భనలో పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్ తదితరులు ఉన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం పెంచాలి

-సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్

తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 9



దమ్మపేట :- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసి, వంట కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దమ్మపేటలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల మహాసభ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట కార్మికులుగా సేవలందిస్తున్న మహిళలకు ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో వేతనాలు పెంచుతామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పేద విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్న వంట కార్మికులను పక్కనబెట్టి మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది కార్మికుల ఉపాధికి ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితుల్లో రోజుకు సుమారు రూ.100 ఆదాయంతో కుటుంబాలను పోషించడం అసాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, విద్యార్థుల మెనూ చార్జీలను ఒక్కొక్కరికి రూ.20కు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోపు బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కిచెన్ షెడ్లు లేని పాఠశాలల్లో వెంటనే నిర్మించాలని, గ్యాస్, గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతి కార్మికురాలికి రెండు జతల నాణ్యమైన కాటన్ యూనిఫాంలు, గ్లౌజులు, మాస్కులు అందించాలని కోరారు. అనంతరం సంఘ నూతన మండల కమిటీని ఎన్నుకోగా, అధ్యక్షురాలిగా సత్యవతి, కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారిగా కుంట జ్యోతిబి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి, రఘు, జయలక్ష్మి, విజయలక్ష్మి, యశోద, పార్వతి, సంధ్య, ఈశ్వరమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసిన కలెక్టర్

కామారెడ్డి, జూన్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని ఎస్సీకాలనీ లో నిర్వహించిన బడి బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఇంటింటి ప్రచారంద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ-ప్రైమరీ తరగతుల్లో, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను కూడా గుర్తించి నమోదు చేపట్టడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ సంద ర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొ న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫా రాలు, మధ్యాహ్న భోజన పథకం, త్వరలో ప్రారంభం కానున్న అల్పాహార పథకం, డిజిటల్ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి

-పూరి గుడిసె లేని జిల్లాగా గుర్తింపు తేవాలి
-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జోన్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా "పూరిగుడిసెలు లేని జిల్లాగా" కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీ సందర్శించి పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో పర్యటించిన సందర్భంగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పేమెంట్ సమస్యలు తలెత్తితే ఏపీఎంద్వారా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, సర్పంచ్ బండి ప్రవీణ్, ఎంపీడీవో నాగేశ్వర్ రావ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాము సందర్శించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి ,జూన్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం కలెక్టరేట్ సమీపం లోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ,యంత్రాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం తాళాల భద్రత, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా సిబ్బంది విధులు, రిజిస్టర్ తదితర అంశాలను తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, గోదాం ఇన్‌ఛార్జులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ ఇన్ సిఎస్ఆర్ అవార్డు అందుకున్న 'నవ లిమిటెడ్'



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 9

ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఎక్సెన్స్ ఇన్ సిఎస్ఆర్ అవార్డు 2026 ను జె.ఆర్.సి కన్వెన్షన్ సెంటర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు చేతులమీదుగా నవ లిమిటెడ్ ప్రతినిధులు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బత్తుల శ్రీనివాసరావు,కంపెనీ సెక్రటరీ వైస్ ప్రెసిడెంట్ వి .ఎస్. ఎన్.రాజు ,డిజిఎం రామెటీరియల్స్ కే.శ్రీహరి రెడ్డి, మేనేజర్ సిఎస్ఆర్ సిహెచ్. శ్రీనివాసరావు,సోషల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు నేడు అందుకోవటం జరిగింది. నవ లిమిటెడ్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలు ఆరోగ్యం, విద్య ,జీవనోపాధి ఇతర కార్యక్రమాలు కృషిని గుర్తించి ఈ అవార్డు దక్కిందని ప్రెసిడెంట్ యూనిట్ హెడ్ తెలంగాణ ఆపరేషన్ రేర్ అడ్మిరల్ ఎల్ వి శరత్ బాబు (వి)తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ టి సి సి ఐ ప్రతినిధులు ప్రెసిడెంట్ ఆర్. రవికుమార్, జూనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్, కె.భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీతో కేసులను పరిష్కరించుకోండి

-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 9



జూన్ 20 తేదిన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది,ఇతర అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు.తమ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

# దోమకొండమహిళా సమైక్య ఆధ్వర్యంలో బస్సు ప్రారంభం



కామారెడ్డి ,జూన్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల సమైక్య ఆధ్వర్యంలో బస్సును ప్రారంభిస్తున్నట్లు దోమకొండ సర్పంచ్ ఐరన్ నరసయ్య మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ తెలిపారు. మంగళవారం హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్లో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల కు అందజేసిన ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. దోమకొండ నుండి మహిళా సంఘాల సభ్యులు హైదరాబాద్కు తరలి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి సీతక్క ప్రభుత్వ సలహాదారు షబ్బీర్లకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నిర్మాతగా మారిన నాగచైతన్య.. కీలక పాత్రలో భూమిక చావ్లా



అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ‘దూత’ సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ‘దూత-2’ పూజా కార్యక్రమాలతో పాటు షూటింగ్ కూడా అధికారికంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నాగార్జున ముఖ్య అతిథిగా విచ్చేసి క్లాప్ కొట్టారు. ఈ సిరీస్ ద్వారా నాగచైతన్య సరికొత్తగా నిర్మాత అవతారమెత్తడం విశేషం. చైతన్య నిర్మిస్తున్న తొలి ప్రాజెక్ట్ ఇదే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో రాబోతున్న ఈ సీజన్‌కు కూడా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ సీజన్‌లోని పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ ఈసారి కూడా అలరించనున్నారు. కాగా, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో ప్రముఖ నటి భూమిక చావ్లా ఒక కీలక పాత్రలో నటిస్తోంది. గతంలో వీరిద్దరూ ‘సవ్యసాచి’ (2018) లో కలిసి నటించారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# ఆయన నటన గురించి మాటల్లో చెప్పలేను: సంయుక్త మీనన్

**-విజయ్ సేతుపతి నటనను ప్రత్యక్షంగా చూడటం ఓ విభిన్న అనుభూతి అని చెప్పిన సంయుక్త**

**-ఆయన పాత్రలోకి మారే విధానం చాలా సహజంగా ఉంటుందని ప్రశంస**

**-స్లమ్‌డాగ్ చిత్రంలో తనది ఎంతో సవాలుతో కూడిన పాత్ర అని వెల్లడి**

**-దర్శకుడు పూరి జగన్నాథ్ పనితీరు, వేగం అద్భుతమని కితాబు**




మలయాళం, తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న

నటి సంయుక్త మీనన్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనతో కలిసి ‘స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్’ చిత్రంలో నటిస్తున్న ఆమె, విజయ్ నటనను ప్రత్యక్షంగా చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని తెలిపారు. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు, తెరపై చూసేదానికంటే భిన్నమైన శక్తిని తీసుకొస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం గురించి సంయుక్త మాట్లాడుతూ, “నేను విజయ్ సర్‌కు పెద్ద అభిమానిని. ఆయన నటనను దగ్గర నుంచి చూడటం మాటల్లో చెప్పలేను. ఒక పాత్రలోకి ఆయన మారే తీరు చాలా సహజంగా ఉంటుంది. డైలాగ్స్ చెబుతుంటే, అవి నిజంగా తనలో నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సహనటిగా ఆ ప్రక్రియను చూడటం నాకు దక్కిన అదృష్టం” అని వివరించారు. ‘స్లమ్‌డాగ్’ చిత్రంలో తన పాత్ర గురించి చెబుతూ, “ఇందులో నా పాత్ర చాలా అందమైనది, ఎన్నో విభిన్న కోణాలు ఉంటాయి. నటిగా ఇది నాకు ఒక పెద్ద సవాల్. ఇలాంటి ప్రత్యేకమైన పాత్ర చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది” అని సంయుక్త మీనన్ అన్నారు. ఈ చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ పనితీరును కూడా సంయుక్త మెచ్చుకున్నారు. “పూరి సర్ దర్శకత్వం చేసే విధానం చాలా స్టైలిష్‌గా, అందంగా ఉంటుంది. ఆయన సమయానికి షూటింగ్ మొదలుపెట్టి, అనుకున్నదానికంటే ముందే పూర్తి చేస్తారు. ఆయన పనితీరు చూడటం ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది” అని తెలిపారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది.

# భారత్‌లో నోలన్ సినిమా క్రేజ్.. ‘ది ఒడిస్సీ’ టికెట్ ధర రూ. 3,300.. అయినా హాట్ కేకుల్లా అమ్మకాలు!

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ సినిమా వస్తోందంటే ఆ సందడే వేరు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం ‘ది ఒడిస్సీ’ విషయంలోనూ ఇదే జరుగుతోంది. నిన్న (జూన్ 8న) భారత్‌లో ఈ సినిమా ఐమ్యాక్స్ షోల కోసం అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, టికెట్ ధరలు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ముంబై, పూణె వంటి నగరాల్లో ప్రీమియం సీట్ల ధరలు ఏకంగా రూ. 3,000 నుంచి రూ. 3,300 వరకు పలుకుతున్నాయి. దేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సినిమా టికెట్లలో ఇవే అత్యంత ఖరీదైనవి కావడం గమనార్హం. అయితే, ధరలు ఆకాశాన్న ంటుతున్నా డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. బుకింగ్స్ ఓపెన్ అయిన నిమిషాల వ్యవధిలోనే పలు షోలకు సంబంధించిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఇది చూసి ట్రేడ్ విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, నగరాల మధ్య టికెట్ ధరల్లో ఇంత భారీ వ్యత్యాసం ఉండటంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఒకే సినిమా అనుభూతికి ఒక్కో నగరంలో ఒక్కో ధర ఎందుకుందని చాలా మంది అభిమానులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రేజ్‌పై ‘ఎక్స్’





(ట్విట్టర్) వేదికగా అభిమానులు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. “భారత్‌లో ఇప్పటివరకు ఎన్నడూ చూడని అత్యధిక టికెట్ ధర ఇది. నోలన్ ఒక పెద్ద బ్రాండ్ అనడానికి ఇదే నిదర్శనం” అని ఒక యూజర్ పోస్ట్ చేశారు. “భారత్‌లో ప్రమోషన్ కోసం చిత్రబృందం రాకపోయినా టికెట్లు నిమిషాల్లో అమ్ముడయ్యాయి. కేవలం పేరుతోనే సినిమాను అమ్మగలగడం క్రిస్టోఫర్ నోలన్ లెగసీ” అని మరో అభిమాని కామెంట్ చేశారు. కొందరైతే, నోలన్ సినిమాలు చిత్రీకరించే ఐమ్యాక్స్ 70ఎఎ ఫార్మాట్‌లో ప్రదర్శించే థియేటర్లు భారత్‌లో చాలా తక్కువగా ఉన్నాయనే విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

**-ది ఒడిస్సీ’ విశేషాలు**

అకాడమీ అవార్డు గ్రహీత క్రిస్టోఫర్ నోలన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. గ్రీకు కవి హోమర్ రాసిన ఇతిహాసం ‘ఒడిస్సీ’ ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. ట్రాయ్ పతనం తర్వాత తన స్వస్థలమైన ఇథాకాకు తిరిగి వెళ్లేందుకు రాజు ఒడిస్సియస్ చేసిన ప్రమాదకర ప్రయాణమే ఈ చిత్ర కథ. ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్, ఆయన కుమారుడు టెలిమాకస్‌గా టామ్ హాలండ్, భార్య పెనెలోప్‌గా యాన్ హాత్వే నటిస్తున్నారు. వీరితో పాటు జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, చార్లీజ్ థెరాన్, జోన్ బెర్న్తాల్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో ఉంది. నోలన్, ఎమ్మా థామస్ తమ సొంత బ్యానర్ సింకాపీపై ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా జులై 17న విడుదల కానుంది.

## స్నేహితురాలి అంత్యక్రియల్లో కన్నీటిపర్యంతమైన సల్మాన్ ఖాన్!

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబానికి చిరకాల మిత్రురాలు, అత్యంత ఆత్మీయురాలైన కుముద్ రాణే అంత్యక్రియల్లో ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. మంగళవారం ముంబైలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సల్మాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని, ఆమెకు కడసారి వీడ్కోలు పలికారు. శ్మశానవాటిక వద్ద సల్మాన్ చేతులు జోడించి, కన్నీటిని ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ కార్యక్రమంలో సల్మాన్ తల్లి సల్మా ఖాన్, సవతి తల్లి హెలెన్, సోదరులు సోహైల్ ఖాన్, అర్బాజ్ ఖాన్, సోదరి అర్పితా ఖాన్ శర్మ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు నటి మలైకా అరోరా, నటుడు చుంకీ పాండే కూడా హాజరై నివాళులు అర్పించారు. సల్మాన్ ఖాన్ కుటుంబంతో కుముద్ రాణేకి వృత్తిపరంగా, వ్యక్తిగతంగా దశాబ్దాల కాలంగా విడదీయలేని అనుబంధం ఉంది. కాగా, మే నెల ప్రారంభంలోనే సల్మాన్ తన మరో సన్నిహిత మిత్రుడు సుశీల్ కుమార్‌ను కోల్పోయారు. సుమారు 42 ఏళ్లుగా ఆయన తనకు సోదర సమానుడని అప్పట్లో సల్మాన్ గుర్తుచేసుకున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఆత్మీయులను కోల్పోవడంతో సల్మాన్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో, “ధైర్యంగా ఉండండి భాయిజాన్” అంటూ ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా ధైర్యం చెబుతున్నారు.



# సినిమా మారాల్సిన సమయం వచ్చేసింది.. హీరోల రెమ్యూనరేషన్లపై కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు

**-నటీనటుల అధిక ఫీజుల అంశంపై స్పందించిన కంగనా రనౌత్**

**-సినిమా ఆడనప్పుడు పెట్టిన ప్రతి ఖర్చూ ఎక్కువే అనిపిస్తుందని వ్యాఖ్య**

**-మారుతున్న సమాజానికి అనుగుణంగా సినిమా కూడా అభివృద్ధి చెందాలని సూచన**

**-ప్రేక్షకులు తమను తాము చూసుకునే కథలు రావాలన్న నటి స్మితా తాంబే**

**-ఈ నెల 12న కంగనా కీలక పాత్రలో ‘భారత్ భాగ్య విధాత’ విడుదల**

బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ సినిమా పరిశ్రమపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వేగంగా మారుతున్న సమాజానికి అనుగుణంగా సినిమా కూడా నిరంతరం అభివృద్ధి చెందాలని ఆమె అభిప్రాయపడ్డారు. నటీనటులు అధిక మొత్తంలో పారితోషికాలు తీసుకోవడం వల్లే సినిమాలు నష్టపోతున్నాయా? అన్న ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. ఒక సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైనప్పుడు పెట్టిన ప్రతి ఖర్చూ భారంగానే అనిపిస్తుందని అన్నారు. “ఆదాయం తగ్గినప్పుడు ఇంట్లో ఖర్చులు ఎలాగైతే తగ్గించుకుంటామో, అలాగే సినిమా పరిశ్రమ కూడా మారాలి. ప్రేక్షకుల అభిరుచులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలి” అని కంగనా వివరించారు. ఇదే కార్యక్రమంలో ‘భారత్ భాగ్య విధాత’ చిత్రంలో కంగనాతో కలిసి నటించిన స్మితా తాంబే మాట్లాడుతూ.. “ప్రేక్షకులు ప్రతి కథలోనూ తమ ఉనికిని, తమ జీవితానికి దగ్గరగా ఉండే అంశాలను వెతుక్కుంటారు. సామాన్య ప్రేక్షకులకు, సినిమా కథలకు మధ్య సంబంధం ఎంతగా పెరిగితే, వారిని అంతగా ఆకట్టుకోగలం” అని తెలిపారు. కాగా, కంగనా రనౌత్ కీలక పాత్రలో నటించిన ‘భారత్ భాగ్య విధాత’ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఓ తీవ్రవాద దాడి సమయంలో కామా ఆసుపత్రిలో వందల ప్రాణాలను కాపాడిన సామాన్యుల నిజ జీవిత స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించారు.



Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143